Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 06.01.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 31 పేజీలు : 12, వెల : ₹ 5


ISO 9001-2008
Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# నిన్న బుస్... నేడు తుస్

- ఊరించి ఉసూరుమనిపించిన ప్రధాని
- కొత్త సంవత్సరంలోనూ కొనసాగుతున్న పాత కష్టాలు
- దేశ ఆర్థిక వ్యవస్థలో తీవ్ర నిరుత్సాహం



నవంబర్ 8 రాత్రి 8గంటలకు బుస్... అన్నాడు.. అవినీతిని అంతం చేస్తానంటూ బుసలు కొట్టాడు. డిసెంబర్ 31 వరకు కస్సుబుస్సు మంటూనే వున్నాడు. ఎక్కువ త్రాగకండి మత్తు దించేస్తానన్నాడు. నల్లకుబేరుల గల్లా ఖాళీ చేయిస్తానన్నాడు. క్రొత్త యేడాది భారతావనికి వరాల జల్లు కురిపిస్తానన్నాడు. చివరికి డిసెంబర్ 31న తుస్‌మన్నాడు, గుండె ఝల్లుమనిపించాడు.

ఊరించాడు, ఊహలపల్లకీ ఎక్కించాడు. గాల్లో లేపాడు, చుక్కలు చూపించాడు. మాటల్తోనే స్వర్గానికి చేరువగా తీసుకెళ్లాడు. నూటపాతిక కోట్ల మంది ప్రజలను తన మాయాప్రపంచంలోకి తీసుకెళ్లాడు. వాళ్ల ముందు కనికట్టు ప్రదర్శించాడు. హాంఫట్ అనగానే దశాబ్దాల తరబడి నెలకొన్న అవినీతి మాయమవు తుందన్నాడు. గుట్టలుగా పోగైన నల్లధనం కట్టలుకట్టలుగా వచ్చి మన కళ్ల ముందు పోగుబడుతుందన్నాడు. ఆ నల్లధనంతో మీ బ్రతుకులు మారుతాయన్నాడు. దేశంలో కొత్త బంగారులోకాన్ని ఆవిష్కరిద్దామన్నాడు. తనకు ఒక్క అవకాశమివ్వమని, దేశాన్ని నీతి మార్గంలో నడుపుతానని, ఓ 50రోజులు కష్టాలు, నష్టాలు భరించండని బ్రతిమలాడు కున్నాడు. ఇన్నేళ్లు అవినీతి రాక్షసులను, కుంభ కోణాసురులను చూసిన ప్రజలు దేశాన్ని ప్రక్షాళన చేస్తానంటూ ఓ మొనగాడు వచ్చాడని నమ్మారు. 50రోజులు కాదు ఇంకా కష్టాలు భరిస్తూనే వున్నారు. మరి 50రోజుల తర్వాత దేశాన్నే సమగ్రంగా మార్చేస్తా నన్న ఆ పెద్ద మనిషి ఏమయ్యాడు? ఏమి చెప్పాడు?

(మిగతా 11వ పేజీలో)

## 'తప్పు' తప్పించుకోవడానికే
# తప్పటడుగు



కాకాణి గోవర్ధన్‌రెడ్డి. జిల్లా రాజకీయాలలో అడుగుపెట్టిన రోజు నుండీ ఎప్పుడూ ఓ సంచలనమే! డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో అనూహ్యంగా జిల్లా పరిషత్ ఛైర్మెన్ సీటును దక్కించుకున్న అదృష్ట జాతకుడిగా అప్పట్లో ఓ సంచలనం. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రదర్శించిన రాజకీయ చాణక్యతతో ఏకగ్రీవంగా ఎన్నిక కాబడడం కూడా అప్పట్లో మరో సంచలనం. రాజకీయంగా తనను పెంచి పోషించిన ఆనం వారిపైనే తిరుగుబాటు చేసి 2009లో తనకు అసెంబ్లీ సీటు రాలేదంటూ అలకపాన్పు ఎక్కడం మరో సంచలనం. 2014 ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలవబోయే సీటు సర్వేపల్లి అంటూ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు జోరుగా ప్రచారం చేసుకుని ప్రగల్భాలు పలుకుతున్న తరుణంలో కేవలం 5,446 ఓట్లతో గెలిచి నైతికంగా ఓడడం ఓ సంచలనం.

### వెయ్యికోట్ల కథ అడ్డం తిరిగింది
### ఎరక్కపోయి ఇరుక్కుపోయాడు

బాధ్యతాయుతమైన పదవిలో వుంటూ గౌరవ ప్రదమైన రాజకీయ నాయకుడిగా పిలిపించుకుంటూ పాండిచ్చేరిలో వీధిరౌడీలా అవతార మెత్తి పోలీసు రికార్డులో సెక్షన్ 448, 323, 394, 506(II)IPC r/w 34 IPC క్రింద కేసులో ముద్దాయిగా మారడం మరో సంచలనం. వీటితో పాటు 2014 ఎన్నికల సమయంలో అంతర్జాతీయ డ్రగ్ మాఫియా సహకా రంతో జిల్లాలో నకిలీ మద్యం సరఫరా చేసి తన నియోజకవర్గ ఓటర్ల ప్రాణా లతో చెలగాటమాడి ఆ కేసులో ఏ10గా దానికి సంబంధించిన మరో రెండు కేసుల్లో ఏ11గా నమోదు కావడం, వీటితోపాటు రిటైర్డ్ ఉద్యోగుల ఇళ్ల ప్లాట్లు ఆక్రమించాడంటూ రావెళ్ళ అనితకుమారి మరో 8మంది నెల్లూరు పోలీసుస్టేషన్లో

(మిగతా 11వ పేజీలో)

# బూడిదైన బ్రతుకులు

(వివరాలు 2, 12వ పేజీలో)



- అనుమతిలేని బాణాసంచా గోడౌన్‌లో భారీ పేలుడు
- 10మంది అగ్నికి ఆహుతి
- శోకతప్తమైన జీవితాలు
- బాణాసంచా ప్రమాదాల్లో శివకాశిని తలపించిన సింహపురి
- బాధితులకు జగన్ ఓదార్పు
- ఏడాది చివరిరోజున అలుముకున్న చీకట్లు
- విషాదంతో 2017కు స్వాగతం పలికిన నెల్లూరు





## సంక్రాంతి పందెంకోళ్ళు
## సినిమాలకు... రాజకీయ సెగ

ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి సంబరాలు అంటేనే కోళ్ళ పందేలు, ఎడ్ల పందేలు... ఇవి కాకుండా ఇంకో పందెం కూడా వుంది. అదే సినిమా పందెం. ప్రతి సంక్రాంతికి కూడా అగ్రహీరోల సినిమాలు విడుదలవు తుంటాయి. వీటిలో ఒకరివి హిట్ కావడం, ఇంకొకరివి ఫట్ మనడం కామనే!

తెలుగు చలనచిత్ర రంగంలో అగ్ర హీరోల విభాగంలో ఇప్పుడు మూడో తరం వుంది. ఈ తరానికి తెలిసిన మొదటి తరం హీరోలు ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణలు, రెండో తరానికి సంబంధించి చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్! ఇప్పుడు మూడో తరం వాళ్లొచ్చారు. జూనియర్ ఎన్టీఆర్, పవన్ కళ్యాణ్, మహేష్, రాంచరణ్, అల్లు అర్జున్, ప్రభాస్, నాగచైతన్య, రానా వంటి వాళ్లు. పదేళ్ల క్రితంవరకు కూడా తెలుగు చలనచిత్ర రంగంలో చిరంజీవి, బాలకృష్ణ సినిమాల మధ్య పోటీ వుండేది. సంక్రాంతి పడ్డక్కి ఈ ఇద్దరి హీరోల సినిమాలు ఖచ్చితంగా విడుదలయ్యేవి! అభిమానుల మధ్య పోటీ కూడా తీవ్రంగా ఉండేది.

చాలాకాలం తర్వాత సంక్రాంతికి ఆ ఇద్దరి హీరోల సినిమాలు తెలుగు తెరపైకి రాబోతున్నాయి. వీళ్లిద్దరు కూడా చాలా కాలం నుండి సినిమాలు తగ్గించారు. రాజకీయాల్లో వేగం పెంచారు. కాకపోతే తమ పేరిట ఒక రికార్డు కోసం చెరొక సినిమా చేశారు. చిరంజీవి నటించిన 150వ చిత్రంగా 'ఖైదీ నెం.150' ఈ నెల 11న తెర కెక్కబోతుంటే, బాలకృష్ణ హీరోగా తన 100వ చిత్రం 'గౌతమీపుత్ర శాతకర్ణి' ఈనెల 12న వెండి తెరపైకి రానుంది. ఈ ఇద్దరు అగ్రహీరోల సినిమాలు ఒక్కరోజు తేడాలో విడుదలవుతుండ డంతో అభిమానుల్లో సందడి నెల కొంది. థియేటర్లకు సైతం పోటీ నెల కొంది. తమిళంలో సూపర్‌హిట్ అయిన

(మిగతా 11వ పేజీలో)

# బూడిదైన బతుకులు

- వెలుగులు నింపే పనిలో చీకటి
- 10మంది అగ్నికి ఆహుతి
- శోకతప్తమైన జీవితాలు

***2016 పోతూ పోతూ నెల్లూరుజిల్లాలో ఓ 17 కుటుంబాలలో చీకటి నింపి పోయింది. ఇక కొన్ని గంటల్లోనే కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టబోతుండగా, కొందరికి కొత్త సంవత్సరాన్ని చూసే ఆశ, అవకాశం లేకుండా చేసింది. అనునిత్యం ప్రజల సంతోషాలలో భాగమైన బాణాసంచాను తయారుచేసే కార్మికుల బ్రతుకుల్లో చీకటిని చిమ్మింది.***

పోలీసుల నిర్లక్ష్యం, అధికారుల వైఫల్యం, కొందరు వ్యాపారుల దురాశ... వెరసి ఒక పెను ప్రమాదానికి దారి తీసాయి. 2016 డిసెంబర్ 31వ తేదీన నెల్లూరుజిల్లా చరిత్రపుటలో పెద్దప్రమాదం చోటు చేసుకుంది. నెల్లూరు సమీపంలోని పెన్నా పొర్లుకట్ట వద్ద వున్న బాణాసంచా గోడౌన్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందగా, గురువారానికి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో 8మంది మరణించారు. మిగిలినవారు 80శాతం గాయాలతో నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మొదట బాధితులను పెద్దాసుపత్రికే తీసుకెళ్లారు. కాని అక్కడ వైద్య సదుపాయాలు ఎంత ఘోరంగా అఘోరిస్తున్నాయో తెలిసిందే కదా! అక్కడ వారికి సరైన వైద్యసదుపాయం అందించే అవకాశం లేకపోవడంతో జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు చొరవ తీసుకుని వారిని వెంటనే నారాయణ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం సంభవించింది అనుమతి లేని బాణాసంచా గోడౌన్‌లో! 50గజాల గోడౌన్‌లో 17మంది కార్మికులు పని చేస్తుండడమే ఇక్కడి పరిస్థితులకు అద్దం పడుతుంది. యం.వి.రమణయ్యశెట్టి అనే అతను ఈ బాణాసంచా గోడౌన్ నిర్వహిస్తుండగా భాస్కర్ అనే గుమస్తా దీని వ్యవహారాలు చూస్తుంటాడు. నూతన సంవత్సర వేడుకలతో పాటు, సంక్రాంతి సంబరాలకు బాణాసంచా అమ్మకాలు ఎక్కువగా వుంటాయనే ఉద్దేశ్యంతో కూలీలను పెట్టి బాణాసంచా తయారు చేయిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో నిర్వాహకుడు భాస్కర్ అక్కడే వున్నాడు. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండడంతో అతను పరారుకాగా తర్వాత పోలీసులు అరెస్ట్ చేశారు.






## ఎక్కువమంది యువకులే...

ఈ ప్రమాదంలో చిక్కుకున్న వారిలో ఎక్కువమంది పాతికేళ్ళలోపు యువకులే ఉండడం విచారకరం. నూనూగు మీసాల వయస్సులోనే వారికి నూరేళ్ళు నిండాయి. అందరూ గిరిజన యువకులే! ఇతర పనులకు పోవడంకంటే ఇక్కడైతే నీడపట్టున కూర్చుని పనిచేయవచ్చనే బాణాసంచా గోడౌన్‌లకు వస్తుంటారు. రోజు కూలీ కూడా రూ.500లు ఇస్తుండడంతో ఇక్కడ పనిచేయడానికి ఆసక్తితో వస్తారు. కడుపు నింపుకోవడానికి ఏదో ఒక పని అని వస్తే... ఆ పనే వీరి పాలిట మృత్యువుగా మారింది.

## ఎస్‌బి హెచ్చరికలు బేఖాతరు...

దీపావళి సమయంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు నెల్లూరు సమీపంలోని అన్ని బాణాసంచా గోడౌన్‌లలో తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేని బాణాసంచా గోడౌన్‌లను గుర్తించి, వాటిని తొలగించాల్సిందిగా ఆయా పోలీస్‌స్టేషన్‌లకు సమాచారమిచ్చారు. ఆ గోడౌన్‌లలో ప్రమాదం జరిగిన భాస్కర్ గోడౌన్ కూడా వుంది. అయితే మూడో నగర పోలీసులు దీనిపై పెద్దగా స్పందించలేదు. పూరికే హెచ్చరించి వదిలేసారని తెలిసింది. ఇప్పుడు అదే గోడౌన్‌లో ప్రమాదం సంభవించడంతో మూడోనగర పోలీసుల మెడకు చుట్టుకుంది. జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ అప్పటి త్రీటౌన్ ఎస్ఐ రామకృష్ణను సస్పెండ్ చేయడంతో పాటు ప్రస్తుత సిఐ రామారావు సస్పెండ్‌కు సిఫారసు చేస్తూ ఐజికి లేఖ వ్రాసారు.

మొత్తానికి అధికారులు, పోలీసుల వైఫల్యం వల్ల, విధి నిర్వహణలో ఉదాసీనత వల్ల ప్రజలు ఎంతగా మూల్యం చెల్లిస్తున్నారనడానికి చితికి చిధ్రమైన ఈ బడుగుజీవుల బ్రతుకులే ఓ ఉదాహరణ.

## ఇఫ్కో వ్యవహారాలపై 'స్టేటస్కో'

ఇఫ్కో వ్యవహారాలపై రాష్ట్ర హైకోర్టు మంగళవారం ప్రస్తుతమున్న యధాతధ పరిస్థితిని(స్టేటస్కో) కొనసాగిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 24లోగా ప్రతివాదులు పిటిషన్ దాఖలు చేయాలని లేదంటే పిటిషనర్ల ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని వెల్లడించింది. వివరాల్లోకి వెళితే 1996లో ఇఫ్కో యూరియా కర్మాగారం కోసం రెండు వేల 774 ఎకరాలు భూసేకరణ జరిగింది. అనంతరం దీనిని ఇఫ్కో కిసాన్ సెజ్‌గా మార్పుచేసి వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన ఇఫ్కో ఈ సెజ్ అభివృద్ధికి రూ.200 కోట్లకు పైగా ఖర్చు చేసింది. అనంతరం పలు పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో భూముల అమ్మకాలు, ఆలయ భూముల ఆక్రమణ, జల దోపిడీ తదితర అంశాలలో రూ.10వేల కోట్ల కుంభకోణం జరిగిందని, వెంటనే సిబిఐ విచారణ జరపాలని కొడవలూరు జడ్పీటీసీ శ్రీధర్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు




నెల్లూరు నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ కొడవలూరు మండల అధ్యక్షుడు బెజవాడ శ్రీనివాసులురెడ్డి, వైసిపి నాయకుడు అక్కుల్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఎస్.రామచంద్రరావు వాదించారు. వాదోపవాదాలు అనంతరం హైకోర్టు స్టేటస్కో ఆదేశాలు జారీ చేసింది.

## రైల్వే బడ్జెట్‌ను ప్రత్యేకంగానే ఉంచాలి

- డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య

ప్రత్యేకంగా వున్న రైల్వే బడ్జెట్‌ను కేంద్రం సాధారణ బడ్జెట్‌లో కలిపేందుకు ప్రయత్నిస్తోందని, రైల్వేబడ్జెట్‌ను ప్రత్యేకంగానే ఉంచాలని నెల్లూరుజిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నెల్లూరుజిల్లా వాకాడు మండలం దుగరాజపట్నం గ్రామానికి వచ్చిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణ బడ్జెట్‌లో రైల్వే బడ్జెట్‌ను కలిపితే భవిష్యత్తులో రైల్వే అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. అంతేగాక సామాన్యులకు రైల్వే సేవలు దూరమవుతాయన్నారు. ఈ బడ్జెట్‌లో గూడూరు-దుగరాజపట్నం రైల్వే మార్గం ప్రధానమన్నారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్రంలోని బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు ఓడరేవు ఏర్పాటును పట్టించుకోవడంలేదన్నారు. ఇక్కడ ఓడరేవు ఏర్పాటును కృష్ణపట్నం ఓడరేవు యాజమాన్యం అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. ఏఎంసి మాజీఛైర్మెన్ దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ కోట అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షుడు మీజూరు మల్లికార్జునరావు, మాజీ సర్పంచ్‌లు తిక్కవరపు సునందమ్మ, మస్తాన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఏసి స్టేడియంలో ఆధునీకరణ పనుల పరిశీలన

నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతున్న క్రీడా మౌలిక సదుపాయాల ఆధునీకరణ పనులను రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాప్) మేనేజింగ్ డైరెక్టర్ బంగార్రాజు మంగళవారం పరిశీలించారు. నెల్లూరులో ఈ నెల 18 నుంచి 23 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా అండర్-14 కబడ్డీ, ఖోఖో, ఉషు పోటీల నిర్వహణకు సంబంధించిన సమీక్షా సమావేశాన్ని నిర్వహించేందుకు వచ్చిన ఆయన, స్టేడియాన్ని శాప్ డైరెక్టర్ రవీంద్రబాబు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రమణయ్యలతో కలిసి పరిశీలించారు. అనంతరం మొగళ్ళపాలెంలో 150ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న ఆరు క్రీడా అకాడమీల్లో నెల్లూరులో బాలికల క్రీడా అకాడమీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ఆదేశాలకు అనుగుణంగా మొగళ్ళపాలెంలో స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ ఇండియా ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశగా అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన క్రీడా మౌలిక సదుపాయాలకు శాప్ కృషి చేస్తుందని వివరించారు. ప్రారంభ, ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం, క్రీడాప్రాధికార సంస్థలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. శాప్ ఓఎస్డీ రామకృష్ణ, డిఎస్ఏ ఆఫీసు సూపరింటెండెంట్ విజయకుమార్ పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలేకి నివాళి



భారతదేశంలో మొట్టమొదటి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మంగళవారం నెల్లూరులోని తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపకులు ఆచార్య ఆదిత్య, లెక్చరర్ నరశింహారెడ్డి, మహీధర్, రవికుమార్ తదితరులు సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## నెల్లూరు కార్పొరేషన్ ఎస్ఇగా రవికృష్ణంరాజు

నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ ఎస్ఇగా రవికృష్ణంరాజును నియమిస్తూ మంగళవారం ప్రిన్సిపల్ సెక్రటరి కరికాల వల్లవన్ ఉత్తర్వులు జారీ చేశారు. రవికృష్ణంరాజు ఈఈగా నెల్లూరు కార్పొరేషన్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు పదోన్నతి కల్పిస్తూ నెల్లూరు కార్పొరేషన్లోనే నియమించారు. ఎస్ఇగా విధులు నిర్వర్తిస్తున్న మోహన్‌రావుకు పదోన్నతి కల్పించి ఆయన్ను ఎస్ఇగా రెగ్యులర్ చేశారు.

## కోన హుండీ ఆదాయం 12లక్షలు

నెల్లూరుజిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఉన్న శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హుండీల ద్వారా రూ.12,74,937లు ఆదాయం లభించినట్లు పాలకమండలి ఛైర్మెన్ తానంకి నానాజీ, ఈఓ శ్రీరామమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరం రోజున సుమారు 25వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారన్నారు. ప్రత్యేకహుండీల ద్వారా రూ.4,18,717లు తలనీలాల టిక్కెట్లు ద్వారా రూ.22,500లు ప్రత్యేకదర్శనం టిక్కెట్లు ద్వారా రూ.2,11,600లు విఐపి దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.83,400లు ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3,60,270లు, వాహనపూజల ద్వారా రూ.7,950లు, క్యాలెండర్ విక్రయాల ద్వారా రూ.50,000లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పాలకవర్గసభ్యులు సోమయ్య, జ్యోతమ్మ, హరనాథ్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

# ఇది నగరమా..
# నరకమా..?





- తవ్వేసారు... వదిలేసారు...!
- ఈ నిర్లక్ష్యానికి కారకులెవరు...?
- ఎంఎల్ఏ మాటకు విలువలేదు.. మేయర్ అంటే లెక్కే లేదు
- అధికారులు, కాంట్రాక్టర్లదే ఇక్కడ రాజ్యం

*నెల్లూరు నగర కార్పొరేషన్ పరిస్థితి నానాటికీ దిగజారిపోతోంది. నేతల ఆధిపత్యపోరు మధ్యలో ప్రజలకు వాతలు పెడుతున్నారు. అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ ఇద్దరూ నెల్లూరీయులే పట్టణాభివృద్ధి శాఖలకు సారథ్యం వహిస్తున్నా, నెల్లూరు కార్పొరేషన్‌ని మాత్రం బాగుచేయడం ఎవరి తరమూ కాదన్నంత అధ్వాన్నంగా తయారయిపోయింది.*

మాగుంట లే అవుట్‌లోని ఎస్.ఆర్.కె స్కూల్ నుండి సి.పి.ఆర్ కళ్యాణ మండపం వరకూ మంజూరు కాబడిన డ్రైన్ నిర్మాణ విషయంలో మరోసారి నగర కార్పొరేషన్ అసమర్థత, నేతల చేతగానితనం బయటపడిపోయింది.

ఇక్కడ గత కొన్నేళ్ళ ప్రయత్నం ఫలితంగా మంజూరైన డ్రైన్ నిర్మాణం అధికారుల అలక్ష్యానికి, కాంట్రాక్టర్ల అహంకారానికి సాక్షీభూతంగా నిలిచిపోయింది. దురాక్రమణతో మున్సిపల్ స్థలంలో నిర్మించిన భవనాలను తొలగించడంలో మున్సిపల్ శాఖ నీళ్ళు నములుతుంటే అది సాకుగా చూపిన కాంట్రాక్టర్ ప్రజల మొహాన ఇసుక, కంకర కొట్టి మనిషి లోతు గుంట తీసి అందులో నిండా మురుగునీళ్ళు నింపి దోమలను ఉత్పత్తి చేస్తూ సరదా చూస్తున్నాడు.

ఈ కాంట్రాక్టర్ పుణ్యమా అని కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన సిమెంటురోడ్డు నాశనమైపోతోంది. కాంట్రాక్టర్ తీసిన గుంట ప్రక్కనే యస్.ఆర్.కె. స్కూలుంది. ఇక్కడి చిన్నపిల్లలెవరయినా ఆడుకుంటూనో లేక స్కూల్ వదిలిన ఆనందంలో ఇంటికి పరిగెత్తుతూనో ఆ గుంటలో పడితే అంతే సంగతులు. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్న రీతిలో రాజకీయ నేతలూ అధికారులూ వచ్చి దొంగ ఏడుపులు ఏడ్చి ఓదార్చిపోతారు.

ఈ కాలువ విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యానికి సంబంధించి మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ 5వారాల క్రితం రూరల్ శాసనసభ్యుడిని కలిసి విన్నవించుకుంది. ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే పనులు మొదలయ్యేలా చూడాలని ఆదేశాలు ఇచ్చాడు. అదేరోజు మేయర్‌ని కూడా కలిసి తమ గోడు చెప్పుకుంటే ఆయన కూడా అధికారులను పిలిచి వెంటనే పనులు మొదలుపెట్టేలా చూడాలని హుకుం జారీ చేశాడట. కానీ ఫలితం మాత్రం శూన్యం. రోజులు మారుతున్నాయి, వారాలు మారుతున్నాయి, నెలలు మారుతున్నాయి... చివరికి సంవత్సరం కూడా మారింది... కానీ ఈ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అహంకారం మాత్రం మారలేదు.

ఈ దరిద్రానికి తగ్గట్లుగా మంత్రిగారి బామ్మర్ది అంటూ ఓ పెద్దాయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ భారీగా ఫ్లెక్సీలను ఈ త్రవ్వకానికి సమీపంలో ఏర్పాటు చేశారు. యస్.ఆర్.కె స్కూలు వైపు నుండి వెంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్ళేవాళ్ళకి అక్కడో మలుపు వున్నట్లుగా కూడా అర్థంకాని విధంగా ఈ ఫ్లెక్సీ వుంది. ఇక్కడా మళ్ళీ కార్పొరేషన్ నిర్లక్ష్యమే!

ఈ విషయమై "లాయర్" కూడా నేరుగా మేయర్‌తో మొరపెట్టుకుంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడవద్దని విన్నవించుకుంది. కానీ, మేయర్ కూడా స్పందించలేదు. పరిస్థితి అలాగే వుంది. ఇలాంటి నీచ నికృష్టమైన మనస్థత్వం కలిగిన అధికారులు, రాజకీయ నేతల మధ్య జీవనం సాగిస్తున్న నెల్లూరు ప్రజలు ఎంతటి సౌమ్యులో తలుచుకుంటే ఆశ్చర్యమేస్తుంది. వారి ఓర్పుని, సమాజం పట్ల వారు చూపిస్తున్న అసక్తతని చూస్తే జాలి కలుగుతుంది. ఇది ఉద్యమాల పురిటి గడ్డగా పిలవబడిన విక్రమ సింహపురేనా అన్న అనుమానం కలుగుతోంది. మొద్దుబారిన చర్మంతో రాయిలాంటి హృదయంతో ప్రజల జీవితాలతో చెలగాట మాడుతున్న ఇలాంటి వారిని ఆ భగవంతుడే మార్చాలి... నెల్లూరు నగరమా వర్ధిల్లు...!



## 'పెద్దల పండుగ' వస్తున్నా పట్టించుకోరా?

### - పారిశుద్ధ్యం తీరుపై ఎమ్మెల్యే అనిల్ ఆగ్రహం

ఈనెల 14వతేదీన పెద్దల పండుగ వస్తున్నా బోడిగాడితోటలో పారిశుద్ధ్య పరిస్థితి పరమ అధ్వాన్నంగా వుందంటూ నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దల పండుగకు ప్రజలు ఇక్కడికి వస్తారు కనుక, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇక్కడ చెత్త పేరుకుపోయిందని, ఫలితంగా ఈ ప్రాంతంలో నివాసం వుంటున్నవారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర, వందవాసి రంగ, సిద్దు రమణారెడ్డి, అశ్వత్థామ, శోభన్‌బాబు తదితరులున్నారు.

## జగన్ విమర్శలు అర్ధరహితం



### - ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

బాణాసంచా పేలుళ్ళ బాధితులను పరామర్శించేందుకు నెల్లూరు వచ్చిన జగన్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుపై, తెలుగుదేశం ప్రభుత్వంపై విమర్శలు, ఆరోపణలు చేయడం అర్ధరహితమని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తీవ్రస్థాయిలో విమర్శించారు. బుధవారం నెల్లూరులోని టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ బాణాసంచా పేలుడు బాధితులను ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించడం సంతోషకరమైన విషయమని, అయితే ఇక్కడకు వచ్చి అనవసరంగా చంద్రబాబు నాయుడ్ని దూషించడం సబబు కాదన్నారు. ఆయన వాడిన పదజాలం అసభ్యకరంగా ఉందన్నారు. జగన్‌కు వైకాపా నాయకులకు, వైయస్సార్ కుటుంబ సభ్యులకు దళితులు, గిరిజనుల గురించి మాట్లాడే అర్హత, హక్కు లేదన్నారు. బాణాసంచాపేలుళ్ల బాధితులకు 24 గంటలు జరక్కముందే నష్టపరిహారం చెల్లించామన్నారు. అంతా అయ్యాక నాలుగురోజులు గడిచిన తర్వాత తీరిగ్గా వచ్చి ముఖ్యమంత్రిపై అసత్య ఆరోపణలు, లేనిపోని విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో నెల్లూరుజిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, టిడిపి నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు రంగారావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు ధర్మవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.




**అమ్మకు నివాళి**

ఇటీవల మరణించిన తమిళనాడు ముఖ్యమంత్రి, వీరవనిత జయలలిత సమాధిని డిసెంబర్ 28వ తేదీన సందర్శించి నివాళులర్పిస్తున్న ఆమె వీరాభిమాని, నెల్లూరుకు చెందిన పోతిరెడ్డి కమలాకర్, సెల్.9908737555

ADVT


### అమ్మ ఫర్నిచర్ మాల్ ఆధ్వర్యంలో...

## మైమరపిస్తున్న ఇంటర్నేషనల్ ఫర్నీచర్ ఎక్స్‌పో



ఫర్నీచర్ రంగంలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకుని ఎన్నో ఏళ్ళుగా సింహపురి ప్రజలకు అందుబాటు ధరలతో ఫర్నీచర్‌ను అందిస్తున్న అమ్మ ఫర్నీచర్స్ ఆధ్వర్యంలో "ఇంటర్నేషనల్ ఫర్నీచర్ ఎక్స్‌పో-2017"ను నెల్లూరు మినీబైపాస్‌రోడ్డు జిపిఆర్ కళ్యాణ మండపంలో గురువారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ ఎక్స్‌పో ఈ నెల 9వ తేదీ వరకు ఉంటుంది. ఈ సందర్భంగా అమ్మ ఫర్నీచర్ అధినేతలు గడ్డం సుధాకర్‌రెడ్డి, గడ్డం సుమన్‌రెడ్డి, గడ్డం సుజన్‌రెడ్డిలు మాట్లాడుతూ గత 9సంవత్సరాలుగా తమ కస్టమర్లకు సరసమైన ధరలతో 25శాతం రాయితీతో అన్ని రకాల ఫర్నీచర్లను విక్రయిస్తున్నట్లు తెలిపారు. మలేసియా, చైనా, ఇండోనేసియా, తైవాన్, సింగపూర్ తదితర దేశాల నుండి దిగుమతి చేసుకున్న సోఫాసెట్లు, డైనింగ్ టేబుల్స్, కబోర్డులు, కుర్చీలు, డబుల్, సింగిల్ కాట్స్ తదితరాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ప్రతి ఐటమ్‌పై కూపన్లు ఇస్తున్నామని, సంక్రాంతి అనంతరం ముఖ్యఅతిథుల చేతులమీదుగా డ్రా తీసి గెలుపొందిన విజేతకు స్కూటీని బహుమతిగా అందజేస్తున్నామన్నారు. నగదు లేక నగదు రహిత విధానంలో, క్రెడిట్ కార్డు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.




## 'ప్రభా'తం

# విష రాజకీయాలకు విరుగుడు

**కులాలు-మతాలవారీగా ప్రజలను విభజించి పాలించే రాజకీయాలకు ఇక చెల్లుచీటీ ఇస్తూ రాజ్యాంగ ధర్మాసనం తాజాగా ఇచ్చిన తీర్పు సర్వోత్కృష్టమైనది. ఈ తీర్పు అందరికీ కనువిప్పు కావాలి. భారతావని విభజన రాజకీయాలకు కాక.. విశుద్ధమైన రాజకీయాలకు వేదికగా వుండాలనే ఆకాంక్షతో ఇచ్చిన ఈ తీర్పు ఎంతైనా అభినందనీయం. అందరికీ అనుసరణీయం. ఇలాంటి విశిష్టమైన తీర్పులు దేశపురోభి వృద్ధికి.. జాతి ప్రగతికి ఎంతైనా దోహదం చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.**

ఓటుబ్యాంకు రాజకీయాలతో భారతదేశ లౌకికవాద స్ఫూర్తిదీపులు నానాటికీ మసకబారిపోతున్న సమయంలో ఎన్నికల యజ్ఞానికి పవిత్రత చేకూరేలా రాజ్యాంగ ధర్మాసనం తాజాగా ఇచ్చిన తీర్పు ఎంతైనా సంచలనం..చరిత్రాత్మకం. మతం, కులం, జాతి, వర్గం భాష ప్రాతిపదికగా ఓట్లను అభ్యర్థించడం ఎన్నికల నిబంధనావళి ప్రకారం అవినీతి కిందికే వస్తుందని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు దేశంలో కలకలం కలిగించడమే కాక, కులమతాల నుంచి రాజకీయాలను వేరుచేసే దిశగా ఇచ్చిన ఈ తీర్పుపై సర్వత్రా ప్రజల నుంచి హర్షం వెల్లడవుతోంది. వ్యక్తికి-మతానికి వున్న సంబంధం వ్యక్తిగతమైనదే నని, ఎన్నికల ప్రక్రియ అనేది లౌకికపరమైన ప్రక్రియ కనుక ప్రజాప్రతినిధుల పనితీరు కూడా లౌకికంగానే వుండాలని, అందువల్ల ఎన్నికల ప్రక్రియలో మతానికి తావు లేదని స్పష్టం చేయడంతో ఈ తీర్పుకు మరింత విశిష్టత చేకూరినట్లయింది. భారతావనిలో ఎన్నికల మహాక్రతువు స్వచ్ఛంగా.. మరింత పారదర్శకంగా జరిగేందుకు ఇది మేలుబాటలు పరచినట్లయింది. రెండు దశాబ్దాల క్రితం నాటి 'హిందూత్వ తీర్పు'ను పునఃసమీక్షించిన సుప్రీం కోర్టు తాజాగా ఈ సంచలన తీర్పు వెలువరించింది. ఇది కొన్ని రాజకీయపార్టీలకు, కొంతమంది నాయకులకు అయిష్టంగానే వుండవచ్చునేమో కానీ, రాజ్యాంగ ధర్మాసనం మాత్రం ఈ విషయంలో తాను చెప్ప దలచుకున్నదంతా స్పష్టంగానే చెప్పింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టిఎస్ ఠాకూర్‌తో సహా ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం మెజారిటీ న్యాయ మూర్తుల అభిప్రాయం మేరకు ఇచ్చిన ఈ తీర్పు అన్ని విధాలా ఎంతో విశుద్ధమైనది.. శ్రేష్ఠమైనదని చెప్పవచ్చు. ఎన్నికల్లో కులం, మతం, వర్గం పేరిట ఏ అభ్యర్థి ఓట్లు అడిగినా ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 లోని 123 (3) సెక్షన్ ప్రకారం అది అవినీతి కిందికే వస్తుందని రాజ్యాంగ ధర్మాసనం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. 'హిందూత్వ' గురించి ఇప్పటికే చాలా చర్చ జరిగిందని, అందుకే 'ఎన్నికల్లో మతం పేరుతో ఓట్లు అడగవచ్చా-లేదా?'.. అనే అంశానికే పరిమితమై తాము తీర్పు ఇస్తున్నామని పేర్కొంది. మనది లౌకకరాజ్యాంగ విధానం కనుక, మతాన్నీ..రాజకీయాలను కలపరాదని, ఎన్నికలు లౌకిక విధానానికి అనుగుణంగానే జరగాలని తీర్పు చెప్పింది. ఇలాంటి విషయాల్లో లౌకికవాదాన్ని దృష్టిలో పెట్టుకోవాలని, అభ్యర్థి, ఎన్నికల ఏజెంట్, ప్రత్యర్థి ఓటర్ల మతాల పేరుతో ఓట్లు కోరడం చట్టం ప్రకారం అవినీతి కిందికే వస్తుందని స్పష్టం చేసింది. అంతేకాదు, "రాజ్య వ్యవహారాలను మతంతో కలపడానికి వీల్లేదని, లౌకకరాజ్యం ఏ మతంతోనూ గుర్తింపు పొందకూడదని, లౌకిక ప్రక్రియ అయిన ఎన్నికల్లో మతానికి చోటు లేదని"..ఖరాకండిగా చెప్పింది. మతం పూర్తిగా వ్యక్తిగతం అంటూనే సంకుచిత రాజకీయాలతో ఎన్నికల ప్రచారాలు నిర్వహించి అధికార పదవులను అందుకోవడం నేరమేనని ఈ తీర్పు ద్వారా సుస్పష్టం కావడంతో ఈ తీర్పుకు మరింత ప్రాధాన్యత వచ్చినట్లయింది. సంకుచిత రాజకీయ ప్రక్షాళనకు దోహదం చేసేందుకు ఈ తీర్పు ఓ మంచి మార్గం వేసిందనే అభిప్రాయాలు సర్వత్రా వినవస్తున్నాయి. సమాజంలో రానురాను కులమత వర్గ ప్రాంత రాజకీయాలు వేళ్ళూనుకున్న నేటి పరిస్థితుల్లో సుప్రీం తీర్పు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నదే. అయితే, ఇప్పటికే దేశంలో ప్రత్యేకించి కుల రాజకీయాలు సమాజాన్ని మరింతగా భ్రష్టుపట్టిస్తూనే వున్నాయి. ఇక, మతపరమైన శక్తులతో రాజకీయాలు కలిస్తే ఎంత ప్రమాదమో అందరికీ తెలిసిందే. అందుకే, కులమతాలకు, వర్గాలకు-ప్రాంతాలకు అతీతంగా..సమాజాన్ని మంచిదారిలో.. మహోన్నతమైన రీతిలో తీర్చిదిద్దాలని ఎందరో మహనీయులు కలలు కన్నప్పటికీ, ఆ కలలను సాకారం చేసే దిశలో ఇంతదాకా ఏ ప్రయత్నమూ చేయని దుర్దశలో..ఇలాంటి తీర్పులు ఎంతైనా కనువిప్పు కలిగించేవనడంలో ఎలాంటి సందేహం లేదు. సమాజం పట్ల వ్యక్తిగత బాధ్యత, సమాజసేవాభిలాష, ప్రజల సమస్యలపట్ల అవగాహన, శ్రద్ధ, మంచి ఆదర్శాలు, మానవత్వం..సేవాభావం, నాయకత్వ పటిమ, ఆయా నాయకుల కార్యదీక్షా దక్షత ఇలాంటివన్నిటినీ పరిగణనలోకి తీసుకునే రోజులు పోయి, ఏ కులమో-మతమో ప్రాతిపదికగా ఓట్లు చేజిక్కించుకోవాలనే దుర్గతి రాజకీయాల్లో వచ్చేసింది. ఆ దుస్థితి ఇకనైనా వైదొలగిపోవాలన్నది అందరి ఆకాంక్ష. నేటికీ దేశంలో ఎంతోమంది విద్యాధికులు, అనేక వర్గాలవారు, ఎందరో నాయకులు.. ఉన్నత స్థాయివారు సైతం ఇంకా కులం కుంపట్లలోనే మగ్గి పోతున్నారన్నది బహిరంగ రహస్యమే. ఎంతోకాలంగా కులతత్వంతో రాజకీయాలు సైతం కుళ్ళిపోతూనే వున్నాయి. ఏ కులం వారిని ఎలా ఆకట్టుకోవాలన్నదే ప్రణాళికగా నాయకులు ఎన్నికల రంగంలోకి దిగుతుండడం అలవాటైపోయింది. కొన్నిచోట్ల ఓట్లే కాదు..సీట్లు కూడా కులతత్వంతోనే ముడిపడివుంటా యనే విమర్శలూ లేకపోలేదు. కులాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు మళ్ళించుకోవడం..కులం గొప్పతో గొప్పనాయకునిగా తమను తామే ముద్రించుకోవడం..తద్వారా ప్రజలను ప్రభావితం చేస్తూ అడ్డదారి రాజకీయాల్లో అందలం ఎక్కాలని చూడడం..ఇవన్నీ సరైన మార్గాలు కానే కాదని నాయకగణం ఈ తీర్పుతోనైనా గుర్తించుకోవాల్సి వుంది.

ఏదేమైనా, కులాలు-మతాలవారీగా ప్రజలను విభజించి పాలించే రాజకీయాలకు ఇక చెల్లుచీటీ ఇస్తూ రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు సర్వదా శిరోధార్యం. ఈ తీర్పు అందరికీ కనువిప్పు అవుతుందనే ఆశిద్దాం!. ఎవరికి వారు నిబంధనావళిని అనుసరిస్తూ.. స్వచ్ఛందంగా, నీతినిజాయితీలతో వ్యవహరించిన నాడే జాతి ప్రగతితో పల్లవిస్తుంది. భారతావని ఇకనైనా విభజన రాజకీయాలకు కాక.. విశుద్ధమైన రాజకీయాలకు వేదికగా వుంటూ ప్రపంచానికే ఆదర్శం కావాలి. అందుకు మేలుబాటగా ఇచ్చిన ఈ తీర్పు ఎంతైనా అభినందనీయం.. అందరికీ అనుసరణీయం!...

## సావిత్రిబాయి పూలే స్ఫూర్తి పురస్కారాలు



నెల్లూరు గాయత్రినగర్ లోని శ్రీ వెంకటేశ్వర విద్యాలయంలో మంగళవారం గుండాల లక్ష్మమ్మ నరసయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 186వ జయంతిని పురస్కరించుకుని స్ఫూర్తి పురస్కారాలు అందజేశారు. జిల్లా స్థాయిలో విద్యారంగంలో స్ఫూర్తిదాయక సేవలను అందిస్తున్న 11మంది మహిళా ఉపాధ్యాయినిలు జిహెచ్ఎస్ మార్గరేట్, డా॥ పి. పెంచలలక్ష్మి, డా॥ కె. ఈశ్వరమ్మ, జి.జ్యోతిశ్రీ, కె.ఎం.వరకుమారి, ఎన్.మస్తానమ్మ, దారా విజయ, నావూరు పార్వతీప్రవీణ, కుంకాల మాధవి, డా॥ జెట్టి దశరధరామిరెడ్డి, డిఎల్ దయాలతలను శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విశ్రాంత ప్రభుత్వ డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకులు డా॥ పి.ఎల్.నరశింహారావు, విశ్రాంత ప్రభుత్వ ప్రధానోపాధ్యాయిని సి.అరుణకుమారి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బందిల మోహన్, ప్రముఖ బాల సాహితీవేత్త డా॥ గంగిశెట్టి శివకుమార్, ప్రముఖ సీనియర్ కథా రచయిత పొట్లూరి సుబ్రహ్మణ్యం, పెన్నా రచయితల సంఘం అధ్యక్షురాలు పెరింబేటి అన్నపూర్ణ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ట్రస్ట్ ఫౌండర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగింది.

## చిన్నారులకు ఎస్‌కెబి టి-షర్టులు



ఎస్‌కెబి ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ 2017 నూతన సంవత్సరం సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు షేక్ అల్లాఉద్దీన్ తన మిత్రమండలి సభ్యులతో కలిసి 50మంది చిన్న పిల్లలకు టి-షర్టులు, వృద్ధులకు, అనాథలకు స్వీట్లు, పండ్లు, బిస్కెట్లు నెల్లూరు జనార్ధన్‌రెడ్డి కాలనీలోని ట్రస్ట్ కార్యాలయంలో పంపిణీ చేశారు. అబ్దుల్ రషీద్, ఆదినారాయణ, అమీర్, రెహమాన్, అబ్దుల్లా, బాషా తదితరులు పాల్గొన్నారు.

## కమనీయం శ్రీవారి కళ్యాణోత్సవం

శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్, హిందూ ధర్మ ప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు దర్గామిట్ట టిటిడి కళ్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కళ్యాణోత్సవం కమనీయంగా జరిగింది. టిటిడి అర్చకులు మాధవగిరి నరసింహమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి శాస్త్రోక్తంగా తిరుమంజనం, అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పుష్పయాగం వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా వేగూరు వెంకటేశ్వర్లు, పెంచలమ్మ దంపతులు, ఇందుకూరుపేటకు చెందిన పూనమల్లి వెంకటేశ్వర్లు, కృష్ణవేణి దంపతులు వ్యవహరించారు. అన్నమయ్య ప్రాజెక్ట్ కళాకారుడు గుండాల గురవయ్య ఆలపించిన అన్నమయ్య కీర్తనలు అలరించాయి. భక్తులకు అన్నప్రసాదం, తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. హిందూధర్మ ప్రచార మండలి అధ్యక్షులు సి.వి. సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు కొండా శేఖర్‌రెడ్డి, హిందూధర్మ ప్రచార పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి, సభ్యులు వేమిరెడ్డి సనత్‌కుమార్‌రెడ్డి, వీరిశెట్టి సుధాకర్, నలుబోలు బలరామయ్యనాయుడు పాల్గొన్నారు.




## కోడిపందేలు నిషేధమా?

ప్రతి దేశంలో హింస వుంది, ప్రతి దేశంలో మూఢత్వం వుంది. కొన్ని పండుగల రోజున లక్షలాది మూగజీవాలను వధిస్తుంటారు. ఒక వర్గం వారు పూజించే సాధుజీవులను ఇంకో వర్గం వారు కర్కశంగా చంపుతుంటారు. జాతర్లలో జంతు బలులు యథేచ్ఛగా జరుగుతున్నాయి. జల్లికట్టు, బల్లకట్టు పేరిట హింస జరుగుతుంది. న్యాయస్థానాలు వీటి జోలికి వెళ్లడం లేదు. మరికొన్ని వందల ఏళ్లుగా సంక్రాంతి సంబరాలలో సరదాగా జరుపుకునే కోడిపందేలపై మాత్రం నిషేధం ఎందుకు? ప్రతి మతంలో అంధవిశ్వాసాలు వున్నాయి. కోడిపందేలు సరదానేగాని అంధ విశ్వాసం కూడా కాదు. మరి దీనిపై ఆంక్షలెందుకు?

**– వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## ప్రమాదకరంగా గోడౌన్‌లు

ఈమధ్య నెల్లూరులోని పెన్నా పొర్లుకట్ట వద్ద బాణాసంచా గోడౌన్‌లలో అగ్ని ప్రమాదం సంభవించి ఆరుగురు వ్యక్తులు మృతి చెందారు. ఇంకొందరు గాయపడ్డారు. జనావాసాలకు దగ్గరగా బాణాసంచా గోడౌన్‌లు ఉంటున్నాయి. ప్రమాదాలు సంభవిస్తే దాని తీవ్రత ఎక్కువగా వుంటుంది. జనావాసాలకు సమీపంలో బాణాసంచా గోడౌన్‌లు ఉంటున్నా పోలీసులు పట్టించుకోకపోవడం శోచనీయం. ప్రమాదాలకు కేంద్రాలుగా వుండే బాణాసంచా కేంద్రాలు, మద్యం అంగళ్ల విషయంలో నన్నా అధికారులు నిబంధనలను కఠినంగా అమలు చేయాలి.

**నాగూర్‌వలి, నెల్లూరు.**

## తుస్సుమనిపించిన మోడీ

డిసెంబర్ 31న దేశ ప్రజలకు ప్రధాని తీపి కబురు చెబుతాడని వెంకయ్యనాయుడు ఊదరగొట్టాడు. ఈ వెంకయ్య మాటలు నమ్మి ప్రజలు ఆరోజు టీవీలకు అతుక్కుపోయారు. కాని, ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగం తుస్సుమంది. దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లే చర్యలేవీ కేంద్రం చేపట్టడం లేదు. తాత్కాలిక తాయిలాలు తప్పితే పెద్దనోట్లు రద్దు మూలంగా స్థంభించిన దేశీయ మార్కెట్‌ను కదిలించేలా మోడీ ప్రకటన చేయకపోయారు. వట్టి మాటలు తప్ప మోడీ చేతల్లో ఏమీ చేయలేకపోతున్నాడు.

**పసుపులేటి నాగరాజు, నెల్లూరు.**

# పండుగ... పెద్ద దండగ!

## • పక్షుల పేరుతో 3కోట్లు వృధా!





పక్షుల పండుగ పేరుతో ఈసారి 3కోట్ల రూపాయలు పులికాట్ నీళ్లలో పోసారు. పక్షులు లేకుండానే ఈసారి పక్షుల పండుగ జరిపించారు. ఇది మరీ విచిత్రం. ప్రతి ఏడాది మాదిరిగానే 2016 డిసెంబర్27, 28, 29తేదీలలో సూళ్లూరుపేట కేంద్రంగా పక్షుల పండుగను పెట్టారు. దీనికోసం 3కోట్లు కేటాయించారు. అయితే ప్రతి ఏటా జరుపుతున్నారు కాబట్టి ఈ సంవత్సరం జరపకపోతే బాగుండదన్నట్లు ఈ పండుగ నిర్వహించారు. కాని ఏ పక్షుల పేరుతో అయితే పండుగ నిర్వహించారో, ఈసారి ఆ పక్షులే లేకుండాపోయాయి. గత ఏడాది వర్షాలు లేవు. దీంతో నేలపట్టు, పులికాట్‌లలో నీళ్లు తగ్గాయి. నవంబర్ నెలకల్లా పక్షులు రావాలి. కాని ఈసారి వర్షాభావ పరిస్థితుల వల్ల విదేశీ పక్షులు రాలేదు. జిల్లా అధికారులు మాత్రం చెప్పిన టైంకు పండుగ ఏర్పాట్లు చేసారు. పెద్దఎత్తున పబ్లిసిటీ చేసారు. పండుగ ప్రారంభం రోజున స్థానిక ఎమ్మెల్యే సంజీవయ్యను వేదిక మీదకు పిలవలేదు. అలిగివెళ్లిన సంజీవయ్యను ఎమ్మెల్సీ వాకాటి తీసుకొచ్చి స్టేజీ ఎక్కించారు. మూడోరోజు ముగింపు సభను కూడా అదరాబదరా నిర్వహించారు. ముగింపుసభకు ముగ్గురు మంత్రులు నారాయణ, గంటా శ్రీనివాసరావు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డిలు వచ్చారు. అదరాబదరా వచ్చి ప్రసంగాలు ముగించారు. అసలు పక్షులు పండుగ ఎందుకు చేస్తున్నారని గాని, పర్యాటక పరంగా పులికాట్, నేలపట్టుల అభివృద్ధికి తీసుకునే చర్యలు గురించిగాని వాళ్లు మాట్లాడలేదు. సిద్ధడు అద్దంకి వెళ్లనూ వెళ్లాడు, రానూ వచ్చాడు అన్నట్లుగా మంత్రులు ముగింపుసభకు వచ్చి వెళ్లిపోయారు. ఆ తర్వాత సినీ యాక్టర్లు, సింగర్ల చేత సాంస్కృతిక కార్యక్రమాలు జరిపించి పక్షుల పండుగను 'మమ' అనిపించారు.

జిల్లాలో పర్యాటక ప్రగతి అన్నది నేతల మాటల్లో, పత్రికల రాతల్లో తప్పితే ఆచరణ రూపం దాల్చడం లేదు. ప్రతి సంవత్సరం కూడా పక్షుల పండుగ జరిపించడంతోటే ఏదో పర్యాటక రంగాన్ని ఉద్ధరిస్తామనుకుంటున్నారు. అసలు ప్రతి ఏటా పక్షుల పండుగ పేరుతో తగలేస్తున్న డబ్బులతో ఈ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి వున్నా కొంతలో కొంత పర్యాటక అభివృద్ధి జరిగి ఉండేది.



# పెద్దపోర్టుకు.. మంగళం పాడేసారు!

ఏపికి ఇచ్చిన విభజన హామీలలో కేంద్రం ఏ ఒక్కదాన్ని కూడా సవ్యంగా అమలు చేయడం లేదు. ప్రధాన హామీ అయిన ప్రత్యేకహోదాను పాడెక్కించడం తెలిసిందే! ఇక పోలవరంను కేంద్రమే చేపట్టాల్సి ఉండగా, తెరచాటు ఒప్పందాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆ కాంట్రాక్ట్‌ను అప్పగించడం జరిగింది. విభజన హామీలలోనే ఇంకొకటి నెల్లూరుజిల్లా దుగరాజపట్నంలో ఓడరేవు నిర్మాణం! యూపిఏ ప్రభుత్వంలోనే దుగరాజపట్నం ఓడరేవు మంజూరైంది. అయితే దీనికి శంకుస్థాపన చేసేలోపే ఎన్నికలొచ్చాయి. 2014 విభజన చట్టంలో యూపిఏ ప్రభుత్వం దుగరాజట్నం పోర్టును చేర్చింది. ఎన్డీఏ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా దీనిపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పోర్టు కావాలని కోరలేదు. ఈ నేపథ్యంలో ఈ పోర్టు ఎంత అవసరం అన్నదానిని అంచనా వేసేందుకు కేంద్రం ఓ కన్సల్టెన్సీని నియమించింది. ఆ కన్సల్టెన్సీ ఇటీవలే కేంద్రానికి... దుగరాజ పట్నం పోర్టు వల్ల పెద్దగా వాణిజ్య ఉపయోగం లేదని పేర్కొంటూ నివేదిక ఇచ్చింది.


సానుకూలంగా నివేదిక ఇస్తేనే కేంద్రం ఈ పోర్టు నిర్మాణాన్ని చేపట్టడం అంతంత మాత్రం. ఇక వ్యతిరేకంగా నివేదిక ఇస్తే అసలు దాని జోలికి పోతుందా? దుగరాజపట్నం పోర్టు మీద ఇక పూర్తిగా ఆశలు వదులుకోవచ్చు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# నెల్లూరు కబుర్లు

## చంద్రబాబు వస్తున్నాడు?



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 11వ తేదీన నెల్లూరు పర్యటనకు వచ్చే అవకాశాలున్నాయి. వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద నిర్మించబడ్డ విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం భవనాలను ఆయన ప్రారంభిస్తారు. ఈ భవనాల ప్రారంభోత్సవం కోసం చాలా కాలంగా యూనివర్శిటీ విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. ఆ భవనాల నిర్మాణంలో అసంపూర్తిగా ఉన్న పనులను కూడా చకచకా చేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, కలెక్టర్ ముత్యాలరాజులు కూడా యూనివర్శిటీ భవనాలను పరిశీలించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది. సిఎం పర్యటన ఇంకా అధికారికంగా ఖరారు కావాల్సి వుంది.

## క్యాన్సర్ ఆసుపత్రికి విరాళాలు

నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హాస్పిటల్‌కు సత్యంజీనగర్‌లో వుంటున్న శ్రీమతి గోసంగి సుబ్బమ్మ, చేబ్రోలు శ్రీధర్‌లు 5లక్షల విరాళం అందజేశారు. గోసంగి సుబ్బమ్మ తమ తల్లి దండ్రులు గోసంగి సుబ్బ రామయ్య, శ్రీమతి రామ లక్ష్మమ్మల జ్ఞాపకార్థం, అలాగే చేబ్రోలు శ్రీధర్ తమ తల్లి దండ్రులు వీరరాఘవయ్య, శ్రీమతి శాంతమ్మల జ్ఞాపకార్థంగా 2వ తేదీ ఈ విరాళాన్ని ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.లక్ష్మికి అందజేశారు.





అలాగే ఈ నెల 3వ తేదీన బుచ్చిరెడ్డిపాలెం వాస్తవ్యులు దొడ్ల లక్ష్మీనారాయణరెడ్డి, దొడ్ల వరదా రెడ్డి, దొడ్ల రాజగోపాల్‌రెడ్డిలు తమ తల్లి స్వర్గీయ దొడ్ల వెంకట శేషమ్మ జ్ఞాపకార్థం 2లక్షల రూపాయలను క్యాన్సర్ ఆసుపత్రికి విరాళంగా అందజేశారు. జిల్లా కలెక్టర్ ముత్యాల రాజును కలిసి వాళ్లు ఈ విరాళాన్ని వైద్యసేవల నిమిత్తం అందించడం జరిగింది.

## శుభమస్తులో 3వ నానో కారు డ్రా



నెల్లూరులోని శుభమస్తు షాపింగ్‌మాల్‌లో క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి పండుగల సందర్భంగా ఏర్పాటు చేసిన "లక్షణంగా పండుగలు... లగ్జరీగా కార్లు" కార్యక్రమం సోమవారం జరిగింది. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని 3వ నానోకారు డ్రా తీశారు. ఈ లక్కీడ్రాలో రమణారెడ్డి(07841) నానోకారు గెలుచుకున్నట్లు ప్రకటించారు. పట్టుచీర లక్కీ డ్రాను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి తీయగా విజేతగా హరిప్రియ పట్టుచీరను గెలుచుకున్నారు. శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేతలు బయ్యా వాసు, బయ్యా రవి తదితరులు పాల్గొన్నారు.

## 'బార్'లో నూతన సంవత్సర వేడుకలు



నెల్లూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 1న న్యాయవాదులు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు డి.ఫణిరత్నం, ఆర్.రోజారెడ్డి, మాజీ బార్ సెక్రటరీలు ఇ.వి.రామిరెడ్డి, నావూరు శ్రీధర్, సీనియర్ న్యాయవాదులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఓ.అబ్బాయిరెడ్డి, పి.ఇ.విజయం, పి.సి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాత్సల్యకు విరాళం

నెల్లూరుకు చెందిన గొర్రిపాటి రామకోటారెడ్డి తన సోదరుడు గొర్రిపాటి సుందరరామిరెడ్డి జ్ఞాపకార్థం నెల్లూరులోని జనహిత-వాత్సల్య అనాథాశ్రమంకు 75వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈనెల 1వ తేదీన ప్రముఖ సేవాభిలాషి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శ్రీమతి ప్రశాంతి దంపతుల చేతులమీదుగా వాత్సల్య ట్రస్ట్ సంఘటనా కార్యదర్శి జి.వి.సాంబశివరావుకు ఈ విరాళం అందజేశారు. గత కొన్ని దశాబ్దాలుగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సంస్థల్లో ఉద్యోగిగా ఉంటున్న తాను తమ బాస్ చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి స్పందించి ఉడతా



భక్తిగా తనకు చేతనైన సహాయం అందించాలనే లక్ష్యంతో ఈ విరాళాన్ని అందజేస్తున్నట్లు కోటారెడ్డి చెప్పారు. ఎంతో మంచి మనసుతో, అనాథలను ఆదు కోవాలన్న సంకల్పంతో ఈ విరాళం అందజేసిన రామకోటా రెడ్డిని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు అభినందించారు.

## ముక్కోటికి ఏర్పాట్లు



ఈ నెల 8వ తేదీ వైకుంఠ ఏకాదశి సందర్భంగా నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సంవత్సరం మొత్తంలో రంగనాథుడి గుడికి భక్తులు ఉప్పెనలా వచ్చేది ఆరోజే! అర్థరాత్రి ఒంటి గంట నుండే భక్తులు రంగనాయకుల పేటలో ఇటు మాదాల బాలతిమ్మయ్య కళ్యాణ మండపం దాకా, అటు తిక్కన పార్కు దాకా 'క్యూ' కట్టి ఉంటారు. భక్తులు తోసుకుని స్వామిని చూస్తుంటారు. ముక్కోటి నేపథ్యంలో భారీ క్యూలైన్లు, పటిష్ట బందో బస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

### పిఎస్ఆర్ బస్టాండ్‌లో

## రిజర్వేషన్ కౌంటర్

శ్రీ పొట్టి శ్రీరాములు బస్టాండ్(ఆత్మకూరు బస్టాండ్)లో ఆదివారం నూతనంగా రిజర్వేషన్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రవివర్మ, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సత్యనారాయణ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు ప్రధానబస్టాండ్‌లోనే రిజర్వేషన్ కౌంటర్ ఉందని, ఇప్పుడు పిఎస్ఆర్ బస్టాండ్ నుంచి విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, వైజాగ్ తదితర దూరప్రాంతాలకు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో 1, 2 మేనేజర్లు శీనయ్య, మురళీకృష్ణ పాల్గొన్నారు.

## 8న 'సంక్రాంతి' కవిసమ్మేళనం

సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని స్థానిక జిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన కవిసమ్మేళనం నిర్వహిస్తామని ఆ ట్రస్ట్ అధ్యక్షులు గుర్రాల రమణయ్య తెలియజేశారు. మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పర్వదినాల ప్రాశస్త్యాన్ని వివరిస్తూ, 'సంక్రాంతి' అంశంపైనే కవిసమ్మేళనం వుంటుందన్నారు. తన అధ్యక్షత్వంలో ఆ రోజు ఉదయం 9.30 గంటలకు నెల్లూరు టౌన్‌హాల్ ప్రాంగణంలో నిర్వహించే ఈ కవిసమ్మేళనానికి ప్రముఖ బాలసాహితీవేత్త వంగిపురపు శారదాదేవి (గుంటూరు) అధ్యక్షత వహిస్తారని, పలువురు కవులు, కవయిత్రులు పాల్గొంటారని పేర్కొన్నారు. కవులు, సాహిత్యాభిలాషులంతా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## జర్నలిస్టులకు పక్కా ఇళ్ళు

నెల్లూరుజిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, డెస్క్ జర్నలిస్టులకు పక్కా ఇళ్ళు మంజూరు చేయిస్తానని రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా ఏపియూడబ్ల్యూజే నాయకులు ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో నారాయణను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జిల్లాలో జర్నలిస్టుల పరిస్థితిపై చర్చించారు. ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల ఏర్పాటుపై వచ్చిన అభ్యర్థనల మేరకు ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో సంప్రదించినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే ఇళ్ల స్థలాలు పొందిన జర్నలిస్టులకు ప్రభుత్వం తరఫున ఇళ్లు కట్టించేలా, ఇళ్లు లేని జర్నలిస్టులకు త్వరలో వెంకటేశ్వరపురం వద్ద నిర్మించనున్న గృహ సముదాయంలో ప్రత్యేకంగా కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో ఏపియూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎం.వి.చంద్రశేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రెస్‌క్లబ్ ఇన్‌ఛార్జ్ రాజన్, హౌసింగ్ సొసైటి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోళ్ల జయరాజ్, ఆర్.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కుటుంబం బాగుంటే..

## సమాజం బాగుంటుంది



కుటుంబం బాగుంటే సమాజం బాగుంటుందని ముఖ్యమంత్రి చెప్పారని, ఆ విధంగా ఆయన ప్రతి కుటుంబానికి 15అంశాలతో భద్రత కల్పిస్తున్నారని 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం 4వ విడత జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తర్వాత చంద్రబాబులాంటి సమర్థుడైన నాయకుడు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడంతో ఈ రాష్ట్రం నిలబడిందన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకపోయినా మన భవిష్యత్తు బాగుండాలని అనేక పరిశ్రమలు, ప్రాజెక్టులు రావడానికి ఆయన నిత్యం కృషి చేస్తున్నా రన్నారు. జిల్లాకు 20వేల మందికి పింఛన్లు వచ్చాయని తెలిపారు. ఆర్థిక పరిస్థితి బాగలేకపోయినా ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తున్నాడన్నారు. అనంతరం ఆయన రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. బాలిక శిశు సంరక్షణ క్రింద బాలికలకు పత్రాలను అందజేశారు. ఐసిడిఎస్ ద్వారా గర్భిణి మహిళలకు పౌష్టికాహారం అందజేశారు. జన్మభూమి కమిటి మెంబర్లు అబ్రహం, శిరికుమార్, రాజ, ఏసు, శ్రావణ్, పవన్ కుమార్‌రెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ సంక్రాంతి పోటీలు



వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 16వ తేదీ ఉదయం 9గంటల నుండి నెల్లూరు వి.ఆర్.సి మైదానంలో ఆటలు, పాటలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డా॥ టి.వసంతలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మన సంస్కృతిని యువత మరచిపోతున్నారని, మన సంస్కృతి వారికి గుర్తుకు వచ్చేలా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నామని, ఒకటి వ్యక్తిగత పోటీలు, రెండవది గ్రూపు పోటీలని వివరించారు. వ్యక్తిగత పోటీల్లో ముగ్గులు, గొబ్బెమ్మల అలంకరణ పోటీలు, గొబ్బి పాటల పోటీలు, గోరింటాకు పెట్టె పోటీలు ఉంటాయన్నారు. గ్రూప్ పోటీల్లో కోలాటం, నృత్య పోటీలు తదితరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా, వయస్సుతో నిమిత్తం లేకుండా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు రాష్ట్ర మంత్రి నారాయణ చేతులమీదుగా బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనేవారు ఈనెల 10వ తేదీలోగా వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో తమ పేర్లను రిజిష్టర్ చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 7997669102 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# వాకాటికేనా?



## ప్రధాన అర్హత కాంగ్రెస్ నుండి రావడమే!

నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల శాసనమండలి నియోజక వర్గ తెలుగుదేశం అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డినే కొనసాగించే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. దీనికి ఆయనకున్న ప్రధాన అర్హత 2014లో తెలుగు దేశంపార్టీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నుండి జంప్ చేసి ఇక్కడకు రావడమే! ఏళ్ల తరబడి తెలుగుదేశం పార్టీని నమ్ముకుని, ఆ పార్టీ జెండాలు మోసిన నాయకులకు పదవులు ఇచ్చే పద్ధతిని పూర్తిగా పక్కనపెట్టేసాడు చంద్రబాబు. ఏళ్ల తరబడి పార్టీని మోస్తున్న వాళ్లు ఆ పనినే చిత్తశుద్ధితో చేయాలి, ఇతర పార్టీల నుండి వచ్చిన వాళ్లు మాత్రం పల్లకీ ఎక్కాలి... తెలుగుదేశంలో ప్రస్తుతం జరిగేది ఇదే! ఈ కోవలోనే పార్టీలో ఎమ్మెల్సీగా పోటీ చేయడానికి ఎందరో సీనియర్ నాయకులు, పార్టీ కోసం సొంత డబ్బులు కోట్లు తగలేసుకుని చేతులు కాల్చుకున్న నాయకులున్నా, వారిని కాదని వాకాటికే ఎమ్మెల్సీ టిక్కెట్ ఇచ్చే అవకాశాలున్నాయి. వాకాటి పార్టీలో చేరేటప్పుడే ఈ ఒప్పందం మీద చేరాడని సమాచారం.

ముఖ్యంగా వాకాటి, చంద్రబాబుకు కుడిభుజం లాంటి మంత్రి నారాయణను పట్టుకున్నాడు. నారాయణ చొరవ మూలంగానే వాకాటి పార్టీలో చేరాడు. సూళ్లూరుపేటకు చెందిన మరో పారిశ్రామికవేత్త, తెలుగుదేశం నేత గంగాప్రసాద్‌తోనూ వాకాటికి సన్నిహిత సంబంధాలున్నాయి. వాకాటి కోసం నారాయణ, గంగా ప్రసాద్‌లు బలంగా ప్రయత్నిస్తే సీటు రాకుండా పోతుందా?

# చదువులతోనే ప్రగతి వెలుగులు

## - మంత్రి నారాయణ




చదువుకు ప్రథమ ప్రాధాన్యతనిచ్చి పిల్లలు బాగా చదువుకోవాలని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ పి.నారాయణ పిల్లలకు సూచించారు. సోమవారం సాయంత్రం నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్‌ఎస్‌ఆర్ మున్సిపల్ పాఠశాల నందు అడ్వాన్స్‌డ్ ఫౌండేషన్ కోర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ టీచర్లు పిల్లలను మంచి చదువులకై ప్రోత్సహించినట్లైతే వారి ద్వారా మరికొంతమంది ప్రభావితులవుతారని అన్నారు. ఏ ఇంటిలోనైనా ఒకరు ఉన్నత చదువులు చదివి పైస్థాయికి ఎదిగినట్లైతే వారి ద్వారా మరికొంతమంది వారి కుటుంబంలోగాని, వారి బంధువర్గంలోగాని ప్రభావితం అవుతారని, తద్వారా మరికొంతమంది జీవితంలో అభివృద్ధి బాటలో పయనిస్తారని తెలిపారు. ఉదాహరణగా తమ కుటుంబంలోనే తాను ఉన్నతి స్థితికి చేరుకున్న తరువాత చాలామంది ప్రభావితమై సుమారు 100మంది మేర డాక్టర్లుగా, ఇంజనీర్లుగా ఇతర వ్యాపకాలలో మంచిస్థానంలో వున్నారని చెప్పారు. తన విద్యాసంస్థ ద్వారా 50వేల మందికి ఉపాధి అందిస్తున్నట్లు, 4లక్షల మంది విద్యార్థులు విద్యనభ్య సిస్తున్నారని ఆయన తెలిపారు. మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి అందించేందుకుగాను ఈ ఫౌండేషన్ కోర్స్‌ను ప్రారంభించడం జరిగిందని, దీని ముఖ్య ఉద్దేశ్యం 1 నుండి 5వ తరగతి వరకు మూలాలపై పట్టును సాధించడమేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్, మెప్మా పిడి చక్రవర్తి, వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డా॥ వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలకు అక్కడే పరిష్కారం

## - జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు



జన్మభూమి-మావూరు గ్రామ సభలో సేకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫ రెన్స్ హాలు నుండి మండలస్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ జన్మ భూమి - మా ఊరు కార్యక్రమం జరుగే తీరు గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన్మభూమి - మా ఊరు గ్రామసభలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించిన పిదప అర్హత వుంటే అక్కడనే సదరు దరఖాస్తును సరియైనవేనని కంప్యూటర్లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ విషయంపై అధికారులు వాయిదా వేయరాదని, జన్మభూమి-మాఊరు కార్యక్రమం జరిగేటప్పుడు అన్ని శాఖాధికారులు వుంటారు కాబట్టి అప్పటికప్పుడు విషయాలను పరిశీలించి అప్‌లోడ్ చేయాలన్నారు. దరఖాస్తులను శాఖల వారిగా విభజించి వాటిని పరిశీలించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్య ప్రణాళికాధికారి పి.బి.కె.మూర్తి మాట్లాడుతూ ప్రతిరోజూ గ్రామసభల నిర్వహణ గురించి కంప్యూటర్లో అప్‌లోడ్ చేయాలన్నారు.

## ప్రపంచ తెలుగు సమాఖ్య

# ఉపాధ్యక్షులుగా విపిఆర్

## కార్యవర్గంలో పలువురు నెల్లూరీయులు

తెలుగుభాషోన్నతి కోసం ఎంతోకాలం నుంచి చెన్నై కేంద్రంగా విశేష కృషి చేస్తున్న విశిష్ట సంస్థ ప్రపంచ తెలుగు సమాఖ్య. తెలుగుభాష పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తూ ప్రపంచవ్యాప్తంగా తెలుగుభాషాభిమానుల ప్రశంసలు అందుకుంటున్న సంస్థ ఇది. ఇంతటి ప్రతిష్ఠాత్మక సంస్థ అయిన ప్రపంచ తెలుగు సమాఖ్యకు మన నెల్లూరీయుడు, ప్రముఖ వదాన్యుడు, తెలుగు భాషాభిమాని వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యాడు. ఈ సమాఖ్యకు ఆయన ఎన్నిక కావడం తెలుగు భాషాభిమానుల్లో ఆనందం కలిగిస్తోంది. ఆయన రాకతో ఈ సమాఖ్య మరిన్ని కొత్త వెలుగులు సంతరించుకుంటుందని భాషాభిమానులు సంతోషిస్తున్నారు. వేమిరెడ్డితో పాటు పలువురు నెల్లూరీయులు కూడా ఈ సమాఖ్య కార్యవర్గానికి ఎంపిక కావడం విశేషం. గత నెల 28న చెన్నైలోని ఎగ్మూర్‌లో జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య కార్యవర్గ సమావేశంలో 2017 -18 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రపంచ తెలుగు సమాఖ్యకు అధ్యక్షురాలుగా శ్రీమతి వివిఎల్ ఇందిరాదత్, ఉపాధ్యక్షుడిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా జెఎం నాయుడు ఎన్నికయ్యారు. వీరితోపాటు నెల్లూరుకు చెందిన ప్రముఖులు నలుబోలు బలరామయ్య నాయుడు నెల్లూరు రీజనల్ కమిటీ ఛైర్మెన్‌గా ఎన్నిక కాగా, మురళీకృష్ణ హోటల్స్ ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు వైస్‌ఛైర్మెన్‌గా ఎన్నికయ్యాడు. అదేవిధంగా, సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా పలగాటి శ్రీనివాసులురెడ్డి ఎన్నికయ్యాడు. మన సంస్కృతి సంప్రదాయాలను, తెలుగుభాషను పరిరక్షించుకుంటూ ఈ సమాఖ్య అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ వుంటుంది. కాగా, ఈసారి నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేది చెన్నైలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగనున్నాయని, ఫిబ్రవరి 26న విజయవాడలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని, నెల్లూరులో కూడా జూన్ లేదా జులై నెలల్లో తెలుగుభాషా వైశిష్ట్యాన్ని ప్రతి బింబించేవిధంగా కార్యక్రమాలు నిర్వ హించే ఆలోచన కూడా వుందని సమాఖ్య రీజనల్ కమిటీ ఛైర్మెన్ నలుబోలు బల రామయ్యనాయుడు తెలియజేశారు. ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ప్రచురితమవుతున్న 'తెలుగు జగతి' త్రైమాసిక పత్రికలో ప్రచురించేందుకు జిల్లాలోని కవులు, రచయితలు కూడా తెలుగు భాషా సాహిత్యానికి సంబం ధించిన రచనలు, కథలు, కవితలు, పద్యాలు, వ్యాసాలు వగైరాలు 'తెలుగు జగతి'కి పంపవలసిందిగా ఆయన జిల్లాలోని కవులు, రచయితలకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. వివరాలకు ఎన్.బలరామయ్యనాయుడు, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్, నెల్లూరు, ఫోన్ 9441003505 నెంబరును సంప్ర దించవచ్చని ఆయన తెలిపారు.



## ఆర్భాటాలకు దూరంగా...

# అనాథల మనసులకు దగ్గరగా..

## • కోటంరెడ్డి కొత్త సంవత్సర వేడుక





నూతన సంవత్సర వేడుకలంటే మందు పార్టీలు, డ్యాన్స్‌లు, ఫుడ్ ఫెస్టివల్స్, స్వీట్లు, పూలబొకేలు, ఫ్లెక్సీలతో శుభా కాంక్షలు... అర్ధరాత్రి రోడ్ల మీద రయ్... రయ్... మంటూ బైక్ రైడ్‌లు... ఇది చాలామంది చేసే పని. కాని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తాను ఎమ్మెల్యే అయి నప్పటి నుండి కూడా నూతన సంవత్సర వేడుకలను పేదలకు, అనాథలకు పండు గగా నిర్వహిస్తున్నారు. కొత్త సంవత్సరం పేరుతో హంగులు, ఆర్భాటాలకు తగలేసే డబ్బుతో మంచి పనులు చేసే కార్యక్రమా నికి ఆయన గతంలోనే శ్రీకారం చుట్టారు.

అదే సాంప్రదాయాన్ని ఈ సంవత్సరం కూడా కొనసాగించారు. ఈ నేపథ్యంలో ఆయన నెల్లూరులో 3వేల మంది పేదలు, అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కోటంరెడ్డి ఇచ్చిన ఈ సేవా కార్యక్రమం పిలుపుకు స్పందించి ఆయన అనుచరులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు ఆయా ప్రాంతాల్లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దర్గామిట్టలోని విశ్వభారతి అంధుల పాఠశాలలో కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్ ఆధ్వర్యంలో, పొదల కూరురోడ్డులో వైకాపా నాయకులు పర్వతాల శ్రీనివాసులు, హజరత్‌నాయుడు, వెంగళ రావునగర్‌లో కార్పొరేటర్ డాక్టర్ సత్తార్, వేదాయపాలెంలో పురుషోత్తం యాదవ్, అయ్యప్పగుడి సెంటర్‌లో మురారి, కొండాయపాలెం చర్చి వద్ద తాళ్లూరు సురేష్, ఉమ్మారెడ్డి గుంటలో చేజర్ల మహేష్, రాజరాజేశ్వరి గుడి వద్ద చెక్కా సునీల్, బారాషహీద్ దర్గా వద్ద మందా పెదబాబు, ఆర్టీసీ వద్ద రియాజ్, ఖలీల్, ఇరుకళలమ్మ గుడి వద్ద శేషసాయి, తల్పగిరి కాలనీలో వెంకటరామయ్య, ఎన్‌బిఐ కాలనీలో తుమ్మల శ్రీనివాస నాయుడుల ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కాగా 2వ తేదీ నెల్లూరు పెద్దాసుపత్రిలో ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి చేతుల మీదుగా 500మంది రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి చేపట్టిన ఈ వినూత్న సేవా కార్యక్రమాన్ని అభినందించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ కొత్త సంవత్సరం పేరుతో ఫ్లెక్సీలు, పూలు, స్వీట్లపై పెట్టే ఖర్చుతో ఫలితం లేదని, అదే ఆ డబ్బుతో ఒక పేదవాడికి దుప్పటి ఇస్తే ఈ చలి కాలంలో వారిని ఆదుకున్న వాళ్లమవుతా మన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ యం.ద్వారకానాథ్, వైసిపి నగరా ధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, కార్పొరేషన్ విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్, కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారార్భాటానికే 'జన్మభూమి'

## - వైఎస్సార్సీపి నేతల విమర్శ



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాలుగో విడత 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమం కేవలం ప్రచారార్భాటాలకేనా అంటూ కార్పొరేషన్ డిప్యూటిమేయర్ ముక్కాల ద్వారకానాథ్, ఫ్లోర్‌లీడర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్‌లు విమర్శించారు. సోమవారం నెల్లూరు నగరపాలకసంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గత జన్మభూమిలో ఇచ్చిన అర్జీలకు ఇంతదాకా మోక్షం లేదన్నారు. జన్మభూమి కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని, అర్హులకు మాత్రం ఒక్క పథకం కూడా అందడం లేదన్నారు. ఫోటోలకు ఫోజులిచ్చేందుకు పింఛన్లు.. రేషన్‌కార్డులు వున్నవారికే మళ్ళీ ఇస్తున్నారని, కొత్తగా ధరఖాస్తు చేసుకున్నవారికి న్యాయం జరగడం లేదని వారు విమర్శించారు. రేషన్‌కార్డులు తప్పులతడకగా వున్నాయని, ఎవరికోసం..ఎందుకోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్సీపి కార్పొరేటర్‌లు ఓబిలి రవిచంద్ర, దామవరపు రాజశేఖర్, గోగుల నాగరాజు, ఎం.డి ఖలీల్‌అహ్మద్, దేవరకొండ అశోక్, నాయకులు వేలూరు మహేష్ పాల్గొన్నారు.



# డిఎల్‌పిఆర్‌ఓకు సన్మానం

పౌరసంబంధాల శాఖలో సుమారు 33ఏళ్ళపాటు వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన డివిజనల్ పిఆర్‌ఓ సాదనాల వెంకటేశ్వరరావును నెల్లూరు డిపిఆర్‌ఓ కార్యాలయంలో ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది ఇటీవల ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో పౌరసంబంధాల శాఖ డిప్యూటి డైరెక్టర్ లాల్‌జాన్, డిపిఆర్‌ఓ మనోరంజన్ తదితరులు మాట్లాడుతూ, వెంకటేశ్వరరావు సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఉద్యోగులు, సిబ్బంది వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించి, ఆయన సేవలను ప్రశంసించారు. ఎపియుడబ్ల్యుజె నాయకుడు జయప్రకాష్‌తో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొని డిఎల్‌పిఆర్‌ఓను సన్మానించారు.

# ఆవ్వులు, గిత్తలకు అందాల పోటీలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అఖిలభారత ఒంగోలు జాతి ఆవులు, గిత్తల అందాల ప్రదర్శన, బండ లాగుడు పోటీలను పూండ్ల వెంకురెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్మెన్ పూండ్ల వెంకురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు రూరల్ మండలం కనుపర్తిపాడులోని రెడ్‌హిల్స్ మైదానంలో ఈ నెల 10 నుంచి 13 వరకు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు జాతి పెయ్యలు, గిత్తల విభాగంలో అందాల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా విభాగాల్లో గెలుపొందిన పశువులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ నగదు బహుమతులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సీనియర్ విభాగ బండలాగుడు పోటీల్లో రూ. 1,01,116లు, రూ.75,116లు, రూ.55,116లు నగదు బహుమతులు, అదేవిధంగా న్యూ కేటగిరి విభాగంలో వరుస బహుమతులుగా రూ.75,116లు, రూ.60,116లు, రూ.55,116లు నగదు, జ్ఞాపికలను అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే ఆవులు, గిత్తల యజమానులు ఈనెల 10వతేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. 11న అందాల పోటీలు, 12న సీనియర్ గిత్తల బండలాగుడు పోటీలు, 13న న్యూ కేటగిరి గిత్తల బండ లాగుడు పోటీలు ఉంటాయని, వివరాలకు 986633079, 9985365336, 9849737366 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

### ---------------------------------- ఎమ్మెల్యే సునీల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రక్కన మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తదితరులు

తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం పేదల అభివృద్ధి కోసం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని 32, 33వార్డుల్లో మంగళవారం జన్మభూమి - మా ఊరు 4వ విడత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సునీల్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, పింఛన్‌లు, ఇతర సంక్షేమ పథకాలను అందజేశారు. ఇంటి నివేశ స్థలాలను కూడా త్వరలోనే ఇస్తున్నట్లు చెప్పారు. జన్మభూమి ప్రత్యేకాధికారి శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి, అర్బన్ సిడిపివో ఉమామహేశ్వరి, ఇన్‌ఛార్జి ఆర్డీవో వెంకటసుబ్బయ్య, మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు సుబ్బమ్మ, నాశిన నాగులు, బిల్లు చెంచురామయ్య, వాటంబేటి శివకుమార్, జన్మభూమి కమిటీ మెంబర్లు, అన్ని శాఖల అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 4వ తేదీ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల 2017 డైరీని విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆయన్నపాత్రుడు ఆవిష్కరించారు. ఏపిపిఆర్‌డిఇఎ అధ్యక్షుడు షేక్ రియాజ్‌అహ్మద్ ఆధ్వర్యంలో ఈ ఆవిష్కరణ జరిగింది.

# ఎన్‌బికెఆర్ కోర్సులకు ఎన్‌బిఎ గుర్తింపు

## - నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వెల్లడి



కోట మండలంలోని విద్యానగర్‌లో వున్న ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో వున్న అన్ని కోర్సు (సి.ఇ, ఇ.ఇ.ఇ, ఎం.ఇ, ఇ.సి.ఇ, సి.ఎస్.ఇ)లకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఏ) వారిచే నాల్గవసారి గుర్తింపు లభించిందని ఆ కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. కళాశాలలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గత నెలలో ఎన్‌బిఏ కమిటీ కళాశాలను సందర్శించి వివిధ విభాగాల్లోని బోధనా పద్ధతులన పరిశీలించి ఈ విశిష్టమైన గుర్తింపునిచ్చిందని పేర్కొన్నారు. కళాశాలలోని అన్ని విభాగాలు ఇప్పటికే మూడు సార్లు ఈ గుర్తింపును పొందాయన్నారు. ఈ గుర్తింపు వల్ల కళాశాల ప్రతిష్ట మరింతగా పెరిగిందని, ఇక్కడి నుంచి పట్టా తీసుకున్న విద్యార్థులకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ విశేషమైన గుర్తింపును సాధించినందుకు కళాశాల బోధన, బోధనేతర సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ గుర్తింపుతో తమ కృషి ఫలించినట్లయిందని, తాము మరింత బాధ్యతతో విద్యార్థుల భవితను తీర్చిదిద్దుతామని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మెన్ డా. ఐ.గోపాలరెడ్డి, డైరెక్టర్ డా. వి. విజయకుమార్‌రెడ్డి తదితరులతో పాటు, పలువురు విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ఏటిఎంలో నగదు పెట్టాలి

పెద్దనోట్ల రద్దు తర్వాత ఏటిఎంలో నగదు పెట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకపోవడంపై సిఐటియు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గూడూరు పట్టణంలోని గడియారపు స్థంభం కూడలి వద్ద మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా నిరసన, ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కేశవులు, డివిజనల్ నాయకులు యాదగిరి, రాబర్ట్ మణి, గోపాల్, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కాస్మోపాలిటన్ క్లబ్

# మినీ ఆడిటోరియం ప్రారంభం



ఆడిటోరియంను ప్రారంభిస్తున్న శ్రీకంటి రామ్మోహన్‌రావు తదితరులు

గూడూరు మాలవ్యానగర్‌లోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో మినీ ఆడిటోరియంను ప్రముఖ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆడిటోరియంకు దాత అయిన జొన్నా లక్ష్మీనారాయణకు ఆయన అభినందనలు తెలిపారు. అలాగే క్లబ్ అధ్యక్షులు వల్లపరెడ్డి ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి యరగుడిపాటి భాస్కర్‌రావు, ట్రెజరర్ మస్తానయ్యను ఆడిటోరియంను బాగా తీర్చిదిద్దినందుకు అభినందించారు. ఇంకా కొత్త సంవత్సరంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దండు మస్తాన్‌రెడ్డి, ఇతర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఇటీవల గూడూరులో సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య, చెన్నుపల్లి ప్రభాకర్ తదితరులు



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 6.1.2017 నుండి**
**తేది. 12.1.2017 వరకు**

ఈ వారము మీనమేష వృషభ రాశులలో చంద్రుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, వృశ్చికంలో శని, ధనుస్సులో రవిబుధులు, కుంభంలో కుజ శుక్ర కేతువులు సంచరిస్తారు.

## పంచాంగము:

తేది.8 ఆదివారము ముక్కోటి ఏకాదశి
శూన్యమాసము జరుగుచున్నది.

## పుష్య మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 6 | శుక్ర | అష్టమి | ఉ॥ గం.9.10వ॥ |
| తేది. 7 | శని | నవమి | ఉ॥ గం.7.0వ॥ |
| | పిదప | దశమి | రా॥ గం.4.46వ॥ |
| తేది. 8 | ఆది | ఏకాదశి | రా॥ గం.2.24వ॥ |
| తేది. 9 | సోమ | ద్వాదశి | రా॥ గం.12.03వ॥ |
| తేది. 10 | మంగళ | త్రయోదశి | రా॥ గం.9.45వ॥ |
| తేది. 11 | బుధ | చతుర్దశి | రా॥ గం.7.40వ॥ |
| తేది. 12 | గురు | పూర్ణిమ | సా॥ గం.5.46వ॥ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

డబ్బుకు ఇబ్బంది లేకుండా వృత్తి వ్యాపారాలు బలపడి ఆదాయం పెరుగుతుంది. అదనపు ఖర్చులు మాత్రం తప్పనిసరిగా ఉంటాయి. అనుకున్న పనులకు అవరోధాలు కలిగి తొలగుతాయి. బంధుమిత్రులు, ప్రముఖులతో సత్సంబంధాలు బలపడతాయి. శుభకార్యాలను నిర్ణయం చేస్తారు. రావలసిన బాకీలు కొంత లభించగలవు. ముఖ్య పనుల బాధ్యతలను ఇతరులకు అప్పగించవద్దు.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

మీ సలహాలు సూచనలు ఇతరులకు ఉపయోగ పడతాయి. అనుకున్న పనులు సవ్యంగా జరగడానికి ఇతరుల సహాయం లభించగలదు. కొత్త వస్తువులు, యంత్రాలు, వాహనాలు సమకూరుతాయి. వృత్తి పరంగా రాబడి సంతృప్తికరం. వ్యాపార వర్గాలకు సామాన్య ఆదాయం మరియు వ్యాపారవృద్ధి అవకాశాలు సన్నగిల్లు తాయి. విద్యా ప్రగతి బాగుంటుంది.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. వృత్తి వ్యాపార వృద్ధికి మీ ప్రయత్నాలు అనుకూలమై ఆదాయం పెరుగు తుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి. కొత్త గృహోపకరణాలు సమకూరుతాయి. శుభకార్య ప్రయ త్నాలు, ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉన్నది. అనుకున్న పనులకు ఆటంకాలను అధిగమిస్తారు. బిల్డర్లు, కాంట్రాక్టర్లకు ప్రభుత్వం వల్ల సమస్యలుండగలవు.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థిక స్థితి క్రమంగా మెరుగు కాగలదు. వ్యాపారాలు, వృత్తి జీవనాలు సామాన్యంగా జరిగి ఆదాయం సామా న్యంగా ఉంటుంది. అనుకున్న పనులు హడావిడిగా జరుపుతారు. బంధుముఖ్యులకు ఆరోగ్యం సరిగా ఉం డదు. పిల్లల వల్ల సమస్యలు కొద్దిగా ఉంటాయి. స్త్రీలు పోటీలలో పాల్గొంటారు. ఋణాలు లభించడం జరుగు తుంది. విద్యా ప్రగతి బాగుంటుంది.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి విస్తరణ జరుపుతారు. ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు సమర్ధ వంతంగా జరుపుకొంటారు. నూతన వస్తువులు సమకూరుతాయి. శుభకార్య ప్రయత్నాలు చేస్తున్నవారికి అనుకూలత ఉన్నది. బంధువర్గంలో తీవ్ర అనారోగ్య బాధితులుంటారు. కళా క్రీడా సాంకేతిక రంగాల వారికి అవకాశాలు బాగుంటాయి.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

మీ సమర్ధతకు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ఉద్యోగులకు అధికారుల ఆదరణ బాగుంటుంది. గృహ వస్తు వాహన రిపేర్ల ఖర్చులు అదనంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఆదాయం పెరుగుతుంది. కొత్త కాంట్రాక్టు లీజులు లభించగలవు. శుభకార్య ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత కలదు.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించగలరు. వృత్తి వ్యాపారాలు వేగం పుంజుకుంటాయి. ఆదాయం పెరుగుతుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. బంధువులతో విభేదాలు సర్దుబాటు కాగలవు. ఇతరుల విమర్శలు ఆరోపణలను ఎదుర్కొంటారు. శుభకార్య ప్రయత్నాలు ఫలించవచ్చును. అనుకోని ప్రయాణాలుం టాయి. మీది కాని విషయాలలో జోక్యం వద్దు.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కొత్త పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు అనుకూలత బాగుంది. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. కొన్ని వివాదాలు, పెండింగ్ సమస్యల నుండి బయపడే అవకాశం ఉన్నది. అనుకోని ఖర్చులుండినను ఇబ్బంది ఉండదు. శుభకార్య ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు, అధికారుల ఆదరణ బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అనుకున్న పనులు నిదానంగా సానుకూలం కాగ లవు. కుటుంబవ్యక్తులతో స్వల్ప విభేదాలుండవచ్చును. ఆర్థిక వ్యవహారాలందు అనుకూలత, వృత్తి వ్యాపారా లందు అభివృద్ధి, రాబడి పెరుగుదల ఉంటుంది. అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. అగ్రిమెంట్ల విషయంలో జాగ్రత్త అవసరం. నూతన వస్తు, వస్త్రాలు సమకూరుతాయి. విద్యార్థులకు మంచి అభివృద్ధి కలదు.


### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఈ వారం ఖర్చులు అధికంగా ఉండగలవు. అయినా డబ్బుకు ఇబ్బంది కలగదు. వృత్తి పరంగా సంపాదన బాగుంటుంది. వ్యాపారవర్గాలకు సామాన్య ఆదాయం, అభివృద్ధి అవకాశాలు చేజారిపోవడం జరుగుతుంది. బంధువర్గంతో విభేదాలు కలుగవచ్చును. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం, ఋణాలు మంజూరు వాయిదా పడగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

చేయదలచిన పనులకు సొంత పర్యవేక్షణ అవసరం. అధికారులకు కొత్త బాధ్యతలు, ఉద్యోగులకు పనివత్తిడి ఉంటుంది. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. అన్నింటా టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల అభివృద్ధి ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఎటువంటి వత్తిడులకు మొగమాటాలకు లొంగవద్దు. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. మిమ్మల్ని అభిమానించే వారు పెరుగుతారు. ఆరోగ్యం బాగానే ఉంటుంది.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులు విజయవంతంగా జరుగుతాయి. ఈ వారం ఖర్చులు పెరిగిపోతాయి. కాని ఆర్థిక ఇబ్బందు లుండక సర్దుబాటు కాగలదు. పెద్దలు ప్రముఖులను కలుసుకొంటారు. ఉద్యోగులకు పనిభారం బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారవృద్ధి ప్రయత్నాలు అనుకూ లించి ఆదాయం పెరుగుతుంది. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. బాకీలు నిలబడిపోతాయి.

# అల్లీపురం అరుణాచలం

శ్రీను గల్పిక

అల్లీపురంలోని సింహపురి చాణక్య, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసం. బయటకెళ్లే పనులేమీ లేక పోవడంతో జెమిని ఛానెల్‌లో రజనీకాంత్ హీరోగా నటించిన "అరుణాచలం" సినిమా వస్తుంటే కుటుంబసభ్యులతో కలసి చూస్తున్నాడు. సినిమా మధ్యలో అరుణా చలం తండ్రి సింహాచలం పెద్దకోటీశ్వ రుడు కావడం, మూడువేలకోట్లు ఆస్థిని ఆయన తన కొడుకు అరుణాచలంకు కొన్ని షరతులతో దక్కేలా వీలునామా వ్రాసి వుండడం వంటి సీన్‌లు వస్తున్నాయి. వాటిని చూసి సోమిరెడ్డి మనసులో... మా నాయన కూడా ఇలా రాసిపెట్టి వుంటే ఈరోజు ఎలక్షన్‌ల కోసం అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది కాదు కదా, ఆయన ఇచ్చిన కొద్దోగొప్పో ఆస్థిని కూడా ఎలక్షన్‌లకే తగలేసాను. నాకు తెలియకుండా నా పేరుతో ఆయన ఆస్తులు రాసిపెట్టి ఉంటే ఎంత బాగుండు... ఆడుతూ పాడుతూ ఇంకో నాలుగు ఎలక్షన్‌లు చేసుకోవచ్చు అని మనసులో అనుకున్నాడు. కొద్దిసేపటికి 'జెమిని' టీవీలో సినిమా అయిపోవడంతో ఆరోజు వార్తలు చూద్దామనిచెప్పి టీవీ 9×9=99 ఛానెల్ పెట్టాడు. ఈయన ఛానెల్ మార్చ డంతోనే స్క్రీన్ మీద సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి కనిపించసాగాడు. ఆయన చేతిలో కొన్ని పేపర్లున్నాయి. కాకాణి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్నాడు. ఇదిగోండి... ఇవి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆస్తులకు సంబంధించిన పత్రాలు, విదేశాలలో ఆయనకు వెయ్యికోట్ల ఆస్తులున్నాయి. భారతదేశం నుండే మనీ లాండరింగ్ ద్వారా సింగపూర్, హాంకాంగ్, మలే షియా దేశాలకు ఆయన డబ్బు వెళ్లింది. విదేశాలలో ఆయనకు భూములు కూడా ఉన్నాయి. ఇవే ఋజువులు అని ప్రెస్ మీట్ ముగించాడు. అంతే... ఆ ప్రెస్ మీట్ చూడగానే సోమిరెడ్డి నిల్చున్న చోటే జూనియర్ ఎన్టీఆర్ మాదిరిగా ఆనందంతో డ్యాన్స్ చేయసాగాడు. అక్కడేవున్న తన భార్య జ్యోతి, కొడుకు రాజగోపాల్‌రెడ్డిలను కౌగిలించుకుని... దేవుడున్నాడు జ్యోతి... దేవుడున్నాడు, మా నాయన ఇచ్చిన ఆస్తులను రాజ కీయాలలో కొచ్చి తగలేసాననే బాధ ఇంతకాలం నాకుండేది. మా నాన్న దేవుడు... నేను ఇచ్చిన ఆస్తులను వీడు నిలుపుకోలేడనే ముందుచూపుతో ఆయన కొంత ఆస్థిని నాకు తెలియకుండానే జాగ్రత్త చేసినట్లున్నాడు. నేను రాజ కీయాలలో ప్రయోజకుడినయ్యాకే ఆ ఆస్థి నాకు చెందాలని వీలునామా రాసి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తండ్రి కాకాణి రమణారెడ్డి వద్ద ఇచ్చినట్లున్నాడు. ఇప్పుడు ఈ రూపంలో బయటపడ్డాయి. ఏదేమైనా మనం అరుణాచలం సినిమా చూడడ మేంటి, ఆ సినిమాల్లో రజనీకాంత్‌కు జరిగినట్లే మనకు జరగడమేంటి, అంతా ఆ దేవుడి దయ అని చెప్పి సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చిత్రపటం ముందు నిలబడి కుటుంబసభ్యులందరూ దండం పెట్టుకున్నారు. తర్వాత సోమిరెడ్డి పి.ఏ హాజరత్‌కు చెప్పి మురళీకృష్ణ హోటల్ నుండి పది కిలోల స్వీట్స్ తెప్పించాడు. టీవీలలో కాకాణి ప్రెస్‌మీట్ చూసి తెలుగుదేశం నాయకులు బీద రవిచంద్ర, బొల్లినేని రామారావు, కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్ తదితరులంతా అల్లీపురంకు వచ్చేశారు. సోమిరెడ్డి అంద రికీ స్వీట్లు తినిపించసాగాడు. అది చూసి పోలంరెడ్డి అవాక్కై... ఆ కాకాణి ఆరో పణలను ఖండించకుండా ఇలా స్వీట్లు తినిపిస్తున్నావేందన్నా అని అడిగాడు. అందుకు సోమిరెడ్డి... ఎందుకు ఖండిం చాలి, ఆయనేం తప్పు చేసాడని ఖండిం చాలి, నాక్కూడా తెలియకుండా వున్న నా ఆస్తుల గురించి నాకు తెలియజేసాడు. ఈరోజు ఆయన చెప్పకపోయి వుంటే, ఆ ఆస్తుల గురించి నాకు తెలిసేది కాదు కదా, వచ్చే ఎలక్షన్‌కు ఎవర్ని అప్పు అడగాలా అని అనుకుంటున్నాను, ఇక నాకు చింతలేదు, నాలుగైదు ఎలక్షన్‌లను అవలీలగా లాగేస్తాను, ఇప్పటిదాకా డబ్బు లేకపోబట్టే నాలుగు ఎలక్షన్‌లు ఓడి పోయాను, ఇక చూపిస్తాను నా పవరేంటో అంటూ జ్యోతి... రాజా... అంటూ తన భార్య, కొడుకులను పిలిచాడు. వాళ్లు వచ్చారు. వారితో... ఇప్పటిదాకా ఉన్న డబ్బులను నా రాజకీయాలకే వాడు కుంటూ మిమ్మల్ని అశ్రద్ధ చేసాను, ఇప్పుడు హ్యాపీగా మీకు ఏం కావాలంటే అవి కొనుక్కోండి... పెళ్లప్పుడు అల్లుడికి కూడా మనం డబ్బుల్లేక ఏమీ కొనివ్వలేదు, జూబ్లీ హిల్స్‌లో ఒక బంగళా, ఒక మెర్సిడెజ్ బెంజ్ కారు కొనిద్దాం! అని చెప్పి వాళ్లను పంపించాడు. తర్వాత పి.ఏ హాజరత్‌ను పిలిచి... మనం అప్పులు ఇవ్వాల్సిన వారి లిస్టు రాసి పెట్టు... వడ్డీతో సహా చెల్లిం చేద్దాం, అట్లాగే నెల్లూరు మాగుంట లే అవుట్, ఆదిత్యనగర్‌లలో మంచి సైట్‌లు చూసి పెట్టు, కొనిపడేస్తే ఓ పక్కన ఉం టాయి. అల్లీపురంలో మా నాయన సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి పేరుతో స్కూల్ వుంది కాబట్టి ఒక మెడికల్ కాలేజీ, హాస్పిటల్ కూడా కడదాము... వీటికి స్థలాలు కూడా చూసి పెట్టు, సర్వేపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మన డబ్బుతోనే వాటర్‌ప్లాంట్లు పెడదాం, రోడ్లు వేయిద్దాం, డ్రైనేజీలు కట్టిద్దాం... వీటన్నింటికి పక్కా ప్లాన్‌లు రెడీ చేయండి, వెయ్యి కోట్లలో సగం సర్వేపల్లి నియో జకవర్గం అభివృద్ధికే కేటాయిస్తున్నాను, దాని అమలుకు పక్కా ప్లాన్ రెడీ చేయండి అని చెప్పాడు.

తర్వాత ఓ స్వీట్ బాక్స్, పూలబొకేలు తీసుకుని సోమిరెడ్డితో పాటు పోలంరెడ్డి, కురుగొండ్ల, బీద, బొల్లినేని, డాక్టర్ జడ్.యస్.లు కారులో పొదలకూరు రోడ్డులోని కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇంటికి బయల్దేరారు. కారులో కూడా వెయ్యి కోట్లపై చర్చ... సోమిరెడ్డి మిగతా నాయకులతో... నాకంతా కలగా వుంది రామకృష్ణన్నా... అరుణాచలం సినిమా చూడడమేంటి... అదే సమయంలో నా పేరుతో వెయ్యికోట్లు ఆస్తులు బయట పడడమేంటి... ఈమధ్య పూజలెక్కువ చేస్తున్నానని, దాని ఫలితమే అయ్యుం టుందని చెప్పగా... పోలంరెడ్డి వుండి... చంద్రమోహనన్నా, నా దగ్గర కొంచెం క్యాష్ టైట్‌గా వుంది, వచ్చే ఎలక్షన్‌లో నన్ను కొంచెం చూడన్నా అని అన్నాడు. దానికి సోమిరెడ్డి... ఏం ఇబ్బంది లేదన్నా, అవసరమైతే జిల్లాలో అందర్నీ చూస్తానని హామీ ఇచ్చాడు. వీళ్లు మాట్లాడుకుంటుండగానే కాకాణి ఇల్లు వచ్చింది. కారు దిగి వీళ్లు లోపలకు వెళ్లారు. సోమిరెడ్డిని చూడగానే కాకాణి ఆశ్చర్యంతో, గౌరవంతో లేచి నిలుచోగా, సోమిరెడ్డి అమాంతం ఆయనను కౌగి లించుకుని చేతిలో స్వీట్స్ ప్యాకెట్, పూలగుత్తి పెట్టి... గోవర్ధనా ఇంతకాలం నిన్ను అపార్థం చేసుకున్నాను, మనసులో ఏమీ పెట్టుకోవద్దు, నీ మూలంగానే నాకు విదేశాల్లో వెయ్యికోట్లు ఆస్తులున్నాయన్న విషయం తెలిసింది. దానికి సంబంధిం చిన డాక్యుమెంట్స్ నీ వద్దే వున్నాయి కదా, దీనికి సంబంధించి ప్రభుత్వానికి ఏవన్నా టాక్స్ కట్టాల్సి వస్తే కట్టేద్దాము, నా ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను ఇంతకాలం కాపాడినందుకు థ్యాంక్స్... నా ఆస్తుల డాక్యుమెంట్స్ నాకిచ్చావంటే ఇక నేనెళ్లిపోతా... అవతల అప్పులోళ్లు వచ్చి ఇంటి దగ్గర కూర్చున్నారట... వాళ్ల అప్పులన్నీ సెటిల్ చేయాలి... నేను కూడా జీవితంలో ఫైనాన్షియల్‌గా సెటిలై పోవాలి... అని చెప్పాడు. అప్పుడు కాకాణి కొన్ని డాక్యుమెంట్లు తెచ్చి సోమిరెడ్డికి ఇస్తూ... ఇవి అసలివో నకిలీవో నాకు తెలియదు కాని, వేరే రూటులో నాకొచ్చాయన్నాడు. అప్పుడు సోమిరెడ్డి... లేదు ఖచ్చితంగా నాకు విదేశాల్లో ఆస్తులున్నాయి... ఇవి నకిలీవైతే అసలు వాటిని నువ్వెక్కడో దాచి వుం టావు... నా ఆస్థిని కాజేయాలని ప్లాన్ చేసుంటావ్... దీని మీద నేనూరుకోను... ఎంత దాకానైనా పోరాడుతానని హెచ్చ రించాడు. దాంతో కాకాణి... ఇదెక్కడి మేళంరా బాబూ అంటూ తల గోక్కోసాగాడు.

## ఆత్మీయ సందడిగా...
# జె.కె.రెడ్డి 75వ పుట్టినరోజు

మాజీశాసనసభ్యుడు, సీనియర్ రాజకీయవేత్త, మంచికి మారుపేరుగా జిల్లాలో ప్రశంసలందుకుంటున్న సేవాభిలాషి జె.కె.రెడ్డి 75వ జన్మదిన వేడుక నెల్లూరులోని ఆయన స్వగృహంలో జరిగింది.

నెల్లూరు రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కస్తూరిదేవి విద్యాలయ సంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ జె.వి.రెడ్డి, రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కె.వి.రత్నంలతో పాటు జిల్లాకి చెందిన పలువురు రాజకీయ, అధికార, అనధికార ప్రముఖులు జె.కె.రెడ్డిని కలిసి అభినందనలు తెలియజేశారు.

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ అర్చకులు సుబ్బారావు ఆధ్వర్యంలో అర్చక బృందం జె.కె.రెడ్డిని నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు.

జె.కె.రెడ్డి మనుమడు జూనియర్ జె.కె.రెడ్డిది కూడా ఇదే రోజు జన్మదినం కావడంతో జె.కె.రెడ్డి అభిమానులు, ఆత్మీయులు, శిష్యులు మరియు కుటుంబసభ్యులు కోలాహలంగా ఈ వేడుకలో పాల్గొన్నారు.









# బివిఎస్‌లో వ్యక్తిత్వ వికాస శిక్షణ



ఈ నెల 5వ తేదీన నెల్లూరులోని బివిఎస్ నగర పాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో 6 నుండి 10వ తరగతి విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాశ శిక్షణా కార్యక్రమం జరిగింది. విశ్వచైతన్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు, రొటేరియన్ సనత్‌కుమార్‌రెడ్డి పాల్గొని వ్యక్తిత్వ వికాశంపై విపులంగా వివరించారు. కిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వైదేహి ప్రసంగించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎంత నల్లధనం పట్టుకున్నారు?



కేతంరెడ్డి వినోద్‌రెడ్డి

పెద్దనోట్లను రద్దు చేసి ఎంత నల్లధనం పట్టుకున్నారో, ఎంతమంది నల్లకుబేరులను జైలుకు పంపారో ప్రధాని నరేంద్రమోడీ వెల్లడించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి డిమాండ్ చేశారు. 5వ తేదీ నెల్లూరు, ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని పెద్దనోట్ల రద్దు నిర్ణయంతో దేశ ఆర్థిక వ్యవస్థ ఒక్కసారిగా కుప్పకూలిపోయిందన్నారు. ఎలుకలున్నాయని ఇళ్ల తగలబెట్టిన చందంగా కొద్దిమంది నల్లకుబేరుల కోసం మోడీ దేశాన్నే తగలబెట్టారన్నారు. 123కోట్ల మంది భారతీయులను భిక్షగాళ్లను చేసి బ్యాంకుల ముందు నిలబెట్టిన ఘనత మోడీదేనన్నారు. నోట్ల రద్దు తర్వాత ఆర్థిక లావాదేవీలు ఆగిపోయాయి. ఎంతోమంది ఉద్యోగాలు కోల్పోయారు. ఏటిఎం క్యూలైన్‌లలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఆర్థిక సంక్షోభం నుండి ప్రజలను గట్టెక్కించేందుకు తక్షణ ఉపశమన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఏసి వాకర్స్ క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 1న వాకర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అందరికీ మిఠాయిలు పంచి, జనవరి 1 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. క్యాలెండర్ ముద్రణకు సహకరించిన దాతలు రాఘవేంద్రషెట్టి, రమణారెడ్డి, తిరుపతినాయుడు, శ్రీనివాసకుమార్, జి.వి.రత్నం, స్నేహసురేష్‌లను అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ నలుబోలు బలరామయ్యనాయుడు, సెక్రటరీ స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, దొరస్వామినాయుడు, డా.అంకిరెడ్డి, ఓబులురెడ్డి, హరిరావు, హరిప్రసాదరావు, చంద్రమౌళి, రాజా రమేష్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## జన్మభూమి...
# రగడ



## కావలి కబుర్లు





**ప్రభుత్వం చేపట్టిన నాలుగవ విడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమం పట్టణంతో పాటు రూరల్ మండలంలోని గ్రామాలలో వైకాపా, తెలుగుదేశం నాయకుల మధ్య గొడవలు, తోపులాటలతో రసాభసాగా సాగుతుంది. అభివృద్ధి జరగటం లేదని ఒకరు, అభివృద్ధి చేస్తుంటే అడ్డుకుంటున్నారని మరొకరు పరస్పరం వాగ్వాదానికి దిగుతున్నారు. దీంతో ఆ కార్యక్రమం కాస్తా కేకలు, తోపులాటలు, రచ్చలతో చివరకు సభ ముగింపు... ఇది కావలిలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు జరుగుతున్న తీరు. దీంతో అదికారులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్న పరిస్థితి.**

పట్టణంలో 4 , 5 వార్డులలో జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమాలతో పాటు రూరల్ ప్రాంతం అయిన సిరిపురంలో అధికార పార్టీ నాయకులకు, వైకాపా నాయకులకు మధ్య అసభ్యకర పదజాలంతో మాటల యుద్ధమే జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పాల్గొని ప్రభుత్వం, అధికారుల పనితీరును విమర్శించారు. జన్మభూమి కార్యక్రమం చేపట్టి ప్రజాధనాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేయడం తప్ప ప్రజల సమస్యలకు పరిష్కారం చూపటం లేదని అన్నారు. కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, ప్రజా సమస్యలను పరిష్కరించకుండా అర్జీలు మాత్రమే స్వీకరిస్తున్నారని దీని వల్ల ఎవరికి ఉపయేగమని ఎమ్మెల్యే ప్రశ్నించారు. జన్మభూమి-మాఊరు జరుగుతున్న తీరుపై మాట్లాడితే తమపై ఎదురుదాడికి వస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఈ కార్యక్రమాలలో ఏం మేలు చేసారో చెప్పాలని డిమాండ్ చేసారు. దీంతో ఎక్కడ జన్మభూమి కార్యక్రమాలు జరిగినా అరుపులు, కేకలతో సభను ముగిస్తున్నారు.

పట్టణంలో 5వ వార్డులో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్న నూతన రాజదాని నిర్మాణ కమిటీ సభ్యులు బీదా మస్తాన్‌రావు మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు , కొత్త రేషన్ కార్డులతో పాటు ఏ సమస్యకైనా పరిష్కారం చూపుతున్నామని, ప్రభుత్వం లోటు బడ్జట్‌లో ఉన్నా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుడుతూ నిరంతరం ప్రజాసేవలో ఉంటున్నారని అన్నారు. కావాలనే వైకాపా నాయుకులు, కౌన్సిలర్లు తాము చేసే పనులకు అడ్డుతగులుతూ రాద్దాంతం చేస్తున్నారని ఇది మంచి పద్దతి కాదని అన్నారు. అభివృద్ధికి కలసి రావాలని పదే పదే కోరుతున్నా దానికి సహకరించని ఎమ్మెల్యే వ్యక్తిగత దూషణలు చేయటం, సభలో అధికారులను తిట్టడం తప్ప చేసింది ఏమిలేదని బీద మస్తాన్ రావు అన్నారు. దీంతో జన్మభూమి కార్యక్రమం రచ్చ, రావిళ్లుకు వేదికగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ పి అలేఖ్య , టీడీపీ పట్టణ అధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరి, ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుత్తికొండ కిషోర్, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొనగా... వైకాపా నాయకులు పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కనమర్లపూడి వెంకటనారాయణ, సుకుమార్‌రెడ్డి, పందిటి కామరాజు జనిగర్ల మహేంద్ర కౌన్సిలర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 10వ వార్డులో...



నాయకుల సహకారంతో 10వ వార్డు దళితవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్నట్లు వార్డు కౌన్సిలర్ కుందుర్తి సునీత, డిఆర్‌యుసిసి సభ్యులు కుందుర్తి కామయ్య అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ పాఠశాల నందు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.అలేఖ్య అధ్యక్షతన జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కామయ్య మాట్లాడుతూ... వార్డు అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, యంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డిలతోపాటు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే యస్‌సి, యస్‌టి సబ్ ప్లాన్ క్రింద 45 లక్షలతో కాలువలు, సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, అధికారులు తధితరులు పాల్గొన్నారు.

# 'తప్ప' తప్పించుకోవడానికే తప్పటడుగు

(మొదటి పేజీ తరువాయి)

నమోదు చేసిన కేసు, తోడేరు గ్రామంలో ప్రసేన్‌కుమార్‌రెడ్డికి సంబంధించిన 54సెంట్లు ఆక్రమించాడని, అలాగే తన సోదరి పేరుమీద మరో 2యకరాల 34సెంట్లు ఆక్రమించాడని పొదలకూరు పోలీసుస్టేషన్లలో రెండు కేసులు మరో సంచలనం.

చివరిగా దళితులకు సంబంధించిన 4యకరాల 20సెంట్లను 420 అవతార మెత్తి ఆక్రమించాడని గాలి శీనయ్య అనే వ్యక్తితో పాటు మరో 6మంది కలిసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డిఓ రంగంలో దిగి ఆక్రమణ వాస్తవమే అని తేల్చి బాధితుల పొలం వారికి తిరిగి ఇప్పించడం మరో సంచలనం. ఇలా చెప్పుకుంటూ వెళ్తే కాకాణి గోవర్ధన్‌రెడ్డి రాజకీయాలలో అడుగుపెట్టినరోజు నుండి ఇప్పటి వరకూ ఎక్కడా కిరికిరి లేకుండా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న దాఖలాలు లేవు.

ఒకప్పుడు ఆయనతో సఖ్యతగా వున్న వాళ్లెవరూ ఇప్పుడాయనకు సన్నిహితంగా లేరు. ఒకప్పుడు 'లాయర్' అందరివాడే కానీ అందరిలాంటి వాడు కాదని చేసిన వ్యాఖ్యల్ని అక్షరసత్యం చేస్తూ ఆయనిప్పుడు కొందరివాడిగానే మిగిలి పోబోతున్నాడేమో అనిపిస్తోంది.

తనపై వరుసగా వస్తున్న విమర్శలు నమోదౌతున్న కేసుల నుండి ప్రజలను త్రప్పుదోవ పట్టించడానికి తాను తప్పుటడుగు వేసి మాస్టర్‌ప్లాన్‌తో సోమిరెడ్డిపై మనీ లాండరింగ్ అస్త్రం ప్రయోగించడం కూడా మరో సంచలనమే.

జిల్లా రాజకీయాలలో అకస్మాత్తుగా అవతరించిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇప్పుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపైన చేసిన, చేస్తున్న తప్పుడు ఆరోపణలతో తన గొయ్యి తానే తీసుకుంటున్నాడు. దొంగే ఇంకొకర్ని దొంగ... దొంగ అన్నట్లుగా సోమిరెడ్డికి విదేశాలలో వెయ్యికోట్లు వున్నాయంటూ ఆగం చేస్తున్నాడు.

తెలుగుదేశం పార్టీ శ్రేణులతో రాయబారాలు, బేరసారాలు జరిపి తన డిమాండ్లు వాళ్లు అంగీకరించకపోవడంతో ఆయన పార్టీ మారకుండా వైసిపిలోనే కొనసాగడం జగన్మోహన్‌రెడ్డి ఆయనకు మళ్ళీ జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టడంతో తానేం చేసినా ఏం చెప్పినా చెల్లుబాటౌతుందన్న మితిమీరిన ఆత్మవిశ్వాసంతో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై వెయ్యి కోట్ల అభియోగాన్ని మోపి నవ్వులపాలై పోయాడు కాకాణి.

తనపై వచ్చిన ఆరోపణలకు సోమిరెడ్డి తీవ్రంగానే స్పందించాడు. నిజాలు నిగ్గు తేల్చాలంటూ ఇటు నెల్లూరులోనూ అటు రాష్ట్ర స్థాయిలో విజయవాడలోనూ ఫిర్యాదు చేశాడు. దొంగ డాక్యుమెంట్లు నకిలీ పత్రాలు సృష్టించిన మాఫియాను వెంటనే అరెస్టు చేయాలని తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు వేగవంతంగానే జరుగుతున్నట్లు సమాచారం.

తనపై వున్న అనేక ఆరోపణల పర్వంలో ఏ నిముషమైనా తనను అరెస్ట్ చేస్తారేమోనన్న అనుమానంతో తెలుగుదేశంపార్టీని ఇరకాటంలో పెట్టాలనే లక్ష్యంతో చంద్రమోహన్‌రెడ్డిని కాకాణి లక్ష్యంగా చేసుకున్నాడన్నది మేధావుల అభిప్రాయం. కేంద్రంలో మీ ప్రభుత్వం వుంది, రాష్ట్రంలో మీ అధికారం ఉంది అంటూ పదేపదే సవాళ్ళు విసురుతూ తనను తాను కాపాడుకునే ప్రయత్నంలో బీరాలు పోతున్నాడన్నది కూడా రాజకీయ పండితుల అభిప్రాయం.

సీనియర్ రాజకీయవేత్తగా, నల్లపరెడ్డి శీనయ్య రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ప్రజానేతగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి జిల్లా రాజకీయాల లోనే కాకుండా రాష్ట్ర రాజకీయాలలో కూడా ఒక విశేష గుర్తింపు వుంది. ఇంతటి స్థాయిలో ఆయనపై విమర్శలు చేస్తే తప్ప రాష్ట్ర స్థాయిలో ఆయన ఇమేజ్‌ని డామేజ్ చేయలేమన్న ఆలోచనతోనే కాకాణి ఈ భారీ ఆరోపణ చేసినట్లు రాజకీయ వర్గాల భావన. అయితే తాను చూపిన డాక్యుమెంట్లన్నీ బోగస్ అని తేలిన వెంటనే తన రాజకీయ భవిష్యత్తే ప్రశ్నార్థకం కాబోతుందన్న చిన్న పాయింట్‌ను కాకాణి మిస్ అయ్యాడన్నది కూడా వీరి వాదన.

రాజకీయాలలో ప్రత్యర్థులు వుండొచ్చు పార్టీలు వుండొచ్చు కానీ నెల్లూరుజిల్లాలోనే లేని కొత్త సంస్కృతిని తెరపైకి తెచ్చి నీచాతి నీచమైన భాషతో "కాకాణి" ఆరోపణలు చేయడం గమనిస్తే తన తప్పులు తప్పించుకోవడానికి ఆయన ప్రదర్శిస్తున్న మేకపోతు గాంభీర్యమే తప్ప ఆయన ఆరోపణలు నిరాధారమైనవని అర్థమైపోతుందన్నది కూడా రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

తనను అరెస్టు చేయొద్దని కాకాణి కోర్టును ఆశ్రయించడం అందుకు అంగీకరించిన కోర్టు ఈ నెల 17వ తేదీ వరకూ రోజూ పోలీస్‌స్టేషన్ కెళ్లి సంతకం చేయమనడం గమనిస్తే రాజకీయ విశ్లేషకులు వూహించింది, ఇప్పుడు జరుగుతుందీ నిజమనే భావన ప్రజల్లో కలుగుతోంది. తన ఎదుగుదలలో ఎన్ని సంచలనాలతో పైకొచ్చాడో అంతే సంచలన స్థాయిలో అధఃపాతాళానికి పడిపోవడానికి కాకాణి తన గొయ్యి తానే తవ్వుకున్నట్లయ్యింది. జిల్లా రాజకీయాలలో కొత్త సంస్కృతికి తెరలేపిన కాకాణి భవిష్యత్ ఏమిటో... ఇక కాలమే చెప్పాలి!...

# నిన్న బుస్... నేడు తుస్

(మొదటి పేజీ తరువాయి)

2016 నవంబర్ 8వ తేదీన భారతదేశంలో 1000, 500 రూపాయల నోట్లను రద్దు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయం తీసుకున్నప్పుడు దేశ ప్రజలే కాదు, ప్రపంచ దేశాలు సైతం ఆయన వైపు చూసాయి. ఇదో పెద్ద సాహసకార్యంగా విదేశీ, స్వదేశీ మీడియా అభివర్ణించింది. నల్లధనం, అవినీతి నిరోధానికి ఇదొక ప్రధాన మార్గంగా మేధావులు అభివర్ణించారు. అదే సమయంలో విపక్షాలు రద్దును వ్యతిరేకించాయి. పెద్దనోట్ల రద్దువల్ల వచ్చే నష్టాలను వాళ్లు అరచి గీపెట్టి చెప్పినా ప్రధాని చెవికెక్కలేదు. పెద్దనోట్ల రద్దుతో దేశ ఆర్థిక వ్యవస్థే స్థంభించి పోయింది. అన్ని వ్యాపారాల్లోనూ స్థబ్దత నెలకొంది. ఆయా ప్రభుత్వరంగాల ఆదాయం దారుణంగా పడిపోయింది. దేశంలోని అన్ని రాష్ట్రాల రాబడి తగ్గిపోయింది. దేశ చరిత్రలో దేశ ఆర్థిక వ్యవస్థకు ఇంత భారీ నష్టం ఎప్పుడూ జరిగి వుండదు. అయినా ప్రధాని 50రోజులు ఆగితే అన్నీ సర్దుకుంటాయని ప్రజలకు ధైర్యం చెబుతూ వచ్చారు. ఆయన నమ్మకం ఏంటంటే 15.50 లక్షల కోట్ల పెద్దనోట్లుండగా, వాటిలో కనీసం 4లక్షల కోట్లు బ్యాంకులకు రాకుండా పోతుందని, అదంతా నల్లధనం కాబట్టి, ప్రభుత్వానిదే అవుతుందని, ఆ డబ్బుతో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టి ప్రజల మెప్పు పొందవచ్చని అంచనా వేశారు. కాని, 2వేల కొత్త నోట్లను బ్యాంకులు పంపిణీ చేయడంలోనే భారీ కుంభకోణం జరిగింది. రిజర్వ్‌బ్యాంక్ ఆయా బ్యాంకులకు పంపించిన 2వేల కొత్తనోట్లు సగం నల్లకుబేరులకే చేరాయి. నల్లధనం ఆ విధంగా మళ్ళీ నల్లధనమైపోయింది. జనం ఒకటి, రెండు నోట్ల కోసం రోజుల తరబడి 'క్యూ'లలో నిల్చుంటే శేఖర్‌రెడ్డి లాంటి నల్లకుబేరులకు మాత్రం నేరుగా బ్యాంకుల నుండే కరెన్సీ బస్తాలు చేరాయి. ఇక నల్లధనాన్ని అరికట్టేదెక్కడ! మొత్తం 15.50లక్షల కోట్లు పెద్దనోట్లుండగా, దాదాపు 15లక్షల కోట్లకు పైనే డిసెంబర్ 30వ తేదీ నాటికి బ్యాంకులకు చేరిందని తెలుస్తోంది. ఇంకా మార్చి 30వరకు ఆర్బీఐ వద్ద నగదు మార్చుకునే వెసలు బాటు ఉండడంతో ఇంకొంత నగదు జమకావచ్చు. మొత్తానికి దేశంలో నల్లధనం లేకుండా పోయింది. మోడీ పుణ్యాన నల్లధనం వున్నోళ్లు కూడా కమిషన్‌లతో దానిని తెల్లధనంగా మార్చుకున్నారు.

నోట్ల రద్దు చేసినప్పటి నుండి ప్రధాని మోడీ, ఆయన భజన బృందం ప్రజలను డిసెంబర్ 31వ తేదీన తీపి కబురు చెబుతామంటూ ఊరిస్తూ వచ్చారు. దేశ ప్రజలు కూడా ఈ 50రోజులు క్యూలలో నిలబడింది మర్చిపోయి ఆరోజు కోసం ఎదురు చూసారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి దేశ వ్యాప్తంగా ప్రజలు భారత్–పాకిస్థాన్‌ల మధ్య వరల్డ్ కప్ వన్డే మ్యాచ్ జరుగుతుంటే టీవీల ముందు ఎలా కూర్చుంటారో, ఆరోజు కూడా అలానే కూర్చున్నారు. మోడీ నోటి నుండి వచ్చే మెరుపులు కోసం దేశ ప్రజలు కళ్లార్పకుండా చూసారు. మోడీ ప్రసంగం అణుబాంబు పేలుడు లెవల్లో ఉంటుందని, సంచలనాలుంటాయని, 2017 కొత్త సంవత్సరం మొదటి రోజు నుండి దేశం దశ తిరగబోతుందని ఆశపడ్డారు. ఆరోజు మోడీ నోరు తెరిచాడు. మెరుపులు లేవు, ఉరుములు లేవు, పెద్దనోట్ల రద్దు తర్వాత బుసలు కొట్టిన మోడీ ఆరోజు తుస్సుమన్నాడు. గర్భిణీస్త్రీలకు 6వేలు, 3కోట్లు కిసాన్ కార్డులను రూపె కార్డులుగా మార్చడం వంటి ఎందుకూ పనికిరాని తాయిలాలతో దేశ ప్రజలను తీవ్ర నిరుత్సాహానికి గురి చేసారు.

ఆర్థిక నిపుణులు, తన పార్టీలోని సీనియర్ నేతలను సంప్రదించకుండా నరేంద్ర మోడీ ఏకపక్షంగా పెద్దనోట్లను రద్దు చేశారు. ఆయన నిర్ణయానికి ప్రజలు బలయ్యారు. ఆయన చెప్పినట్లు ఈరోజు పెద్దనోట్ల రద్దుతో నల్లధనం ఆగిపోలేదు. అవినీతి అంతం కాలేదు. కాని ప్రజల ఇబ్బందులు మాత్రం రోజురోజుకూ రెట్టింపవుతున్నాయి.

# 'మల్లెమాల రామాయణం'పై పిహెచ్‌డి

## కనియంపాటి రామకృష్ణకు డాక్టరేట్





ప్రముఖ సినీకవి, సహజకవి మల్లెమాల సుందరరామిరెడ్డి రచించిన 'మల్లెమాల రామాయణం'పై పరిశోధక విద్యార్థి కనియంపాటి రామకృష్ణ రచించిన పరిశోధక వ్యాసానికి పిహెచ్‌డి లభించింది. నెల్లూరుసీమకు చెందిన మల్లెమాలపై, ఇదే జిల్లాకు చెందిన రామకృష్ణ పరిశోధక వ్యాసం రాసి పిహెచ్‌డి పొందడం విశేషం. అందులోనూ బహుముఖ ప్రజ్ఞాశీలి అయిన మల్లెమాలపై తొలి డాక్టరేట్ గ్రంథం ఇదే కావడం మరింత విశేషం. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య పొన్నా లీలావతి పర్యవేక్షణలో రామకృష్ణ ఈ థీసిస్‌ను వెలువరించారు. 279 పేజీలున్న ఈ గ్రంథంలో 'మల్లెమాల రామాయణం–పరిశీలన' అనే అంశానికి సంబంధించి విశిష్టమైన పరిశోధన సాగింది. అత్యద్భుతమైన మల్లెమాల రామాయణంతో పాటు, అందులోని పాత్రల విశ్లేషణ, రచనా వైదుష్యంతో పాటు, అనితరసాధ్యమైన మల్లెమాల జీవితం, ఇతర రచనలు అన్నీ ఒక సమగ్ర గ్రంథంగా రూపుదిద్దుకున్నాయి. ఎంఏ పట్టభద్రుడైన రామకృష్ణ తొలినుంచి సాహిత్యంపై మక్కువతో వుండేవారు. అందులోనూ సహజకవి అయిన మల్లెమాల కవిత్వమంటే ఆయనకెంతో ఇష్టం. అందుకే, తన పరిశోధక అంశంగా మల్లెమాల రామాయణాన్నే ఎంచుకుని, అందుకు అనుబంధమైన అనేక అంశాలతో ఈ పరిశోధక గ్రంథాన్ని సమగ్రంగా రూపొందించారు. మల్లెమాల గురించి, ఆయన రచనల వైశిష్ట్యాన్ని గురించి, ప్రత్యేకించి కవితారంగంలో మల్లెమాల అపారమైన ప్రతిభాపాటవాల గురించి, అమేయమైన కృషితో ఒక మహారుషిలా ఎదిగిన మల్లెమాల జీవితంలోని అనేకానేక స్ఫూర్తిదాయకమైన అంశాల గురించి తెలుసుకోవాలనుకునేవారికి ఇదెంతో ఉపకరించే గ్రంథం. ఒక్కమాటలో చెప్పాలంటే, మల్లెమాల కవితాహృదయానికి కట్టిన పూలమాల ఇది. ఆయన రచనా సుమాలన్నిటినీ ఏరుకుని..ఆసాంతం చదువుకుని ఏనాటికీ వసివాడని ఒక 'మల్లె మాల'గా కట్టి మనకందించారు రామకృష్ణ. ఆత్మకూరు మండలంలోని మురుగళ్ళ గ్రామంలో జన్మించిన రామకృష్ణ.. తల్లి పేరు అన్నపూర్ణమ్మ. తండ్రి విశ్వజ్ఞాచార్యులు ఆత్మకూరులోని రాఘవేంద్ర జూనియర్ కళాశాలలో సంస్కృత అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షకు తగ్గట్టుగా రామకృష్ణ ఇటీవలే ఎం.ఏ పూర్తిచేశారు. అనంతరం హైదరాబాద్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలోని గురువుల సహకారంతో ఇంతటి అపురూపమైన గ్రంధాన్ని రచించి పరిశోధక రంగంలో మల్లెమాల కవితాకీర్తిని మరింతగా గుభాళింపజేశారు. తద్వారా జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. అందుకు రామకృష్ణకు 'లాయర్' అభినందనలు. ఇక్కడొక మాట. మల్లెమాల వంటి మహనీయుల జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం. అలాంటి మల్లెమాల మనజిల్లావారు కావడం మనకెంతో గర్వకారణం. మల్లెమాలగారు గతించిపోయినా, ఆయన రచనలు తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచే వున్నాయి. ఆ కవితా పరిమళాలు నాటికీ.. నేటికీ.. ఏనాటికీ తెలుగునేలపై గుభాళిస్తూనే వుంటాయి. 'కవిని గన్న తల్లి గర్భంబు ధన్యంబు..కృతిని పొందువాడు మృతుడు గాడు'.. అని మహాకవి జాషువా గారన్నట్లుగా, మహాద్భుత కవి అయిన మల్లెమాలపై ఇంతటి ఉద్గ్రంథం రచించిన రామకృష్ణ జీవితం కూడా ధన్యమే. అదేవిధంగా, ఈ కృతిని నేరుగా అందుకోలేకపోయినా..ఈ గ్రంథకర్తకు మల్లెమాల దివి నుంచి అందించే శుభదీవెనలు ముమ్మాటికీ అందుతూనే వుంటాయి.

## నరేంద్రబాబుకు 'జాతీయ ఆదర్శ గురువు' పురస్కారం



నెల్లూరు కెవిఎన్ఆర్ నగరపాలక పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి గుండాల నరేంద్రబాబుకు విజయవాడలోని సాంస్కృతీ సమాఖ్య (యువ సాహితీవేదిక) 'జాతీయ ఆదర్శ గురువు' పురస్కారాన్ని ప్రదానం చేయనుంది. ఈ నెల 8న విజయవాడలో జరిగే కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారం అందజేస్తారు. క్రాంతదర్శి సావిత్రిబాయిపూలే 186వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యారంగంలో విశేషకృషి చేస్తున్న ఉపాధ్యాయులకు సావిత్రిబాయిపూలే, మహాత్మా జ్యోతిరావ్‌పూలే అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు నిర్వాహకులు శిరీష్‌కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో నెల్లూరుకు చెందిన ఉపాధ్యాయుడు గుండాల నరేంద్రబాబుకు ఈ పురస్కారం లభించడంతో ఆయన సహచరులు, సాహితీమిత్రులు, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

# పందెంకోళ్ళు

(మొదటి పేజీ తరువాయి)

'కత్తి' సినిమాను 'ఖైదీ నెం.150' పేరుతో రీమేక్ చేయగా, అమరావతి రాజధానిగా దేశం మొత్తాన్ని ఏలిన శాతకర్ణి రాజు చరిత్ర నేపథ్యంలో 'గౌతమిపుత్ర శాతకర్ణి'ని రూపొందించారు. బాలకృష్ణ సినిమా ఆడియోను తిరుపతిలో విడుదల చేయగా, చిరంజీవి సినిమా ట్రైలర్ విడుదలకు మాత్రం రాజకీయ ఆటంకాలొచ్చాయి. ఈ సినిమా ఆడియోను విజయవాడలో విడుదల చేయాలనుకున్నప్పటికి, ప్రభుత్వ అనుమతి లభించకపోవడంతో గుంటూరుజిల్లా, చినకాకాణి వద్ద వున్న హాయ్‌ల్యాండ్‌కు మార్చారు.

ఈ రెండు సినిమాల ఆడియో విడుదలలోనే రాజకీయ సెగ మొదలైంది. ఇక సినిమాలు విడుదలయ్యాక ఆ సెగ ఏ రేంజ్‌లో ఉంటుందో చూడాలి.

# బాధితులకు జగన్ ఓదార్పు



*ప్రజలు ఆపదలో పడ్డప్పుడు ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత! ఆ ప్రజలకు అండగా మేమున్నామంటూ ముందుకు రావడం ప్రతిపక్షం బాధ్యత! ఈ విషయంలో రాష్ట్ర ప్రతిపక్ష నేతగా వైకాపా అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి వేగంగా స్పందించారు. మీకు నేనున్నానంటూ పరుగెత్తుకుంటూ వచ్చి బాధితులను ఓదార్చారు.*

ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఈనెల 3వతేదీన నెల్లూరొచ్చారు. రావడం తోనే నేరుగా పెన్నా పొర్లుకట్ట వద్దకు వెళ్లారు. డిసెంబర్ 31వ తేదీ బాణాసంచా పేలుడు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ బాధిత కుటుంబాల వద్దకు వెళ్లారు. వారిని పరామర్శించారు. ప్రమాదమని తెలిసి కూడా బాణాసంచా తయారీ పనులకు ఎందుకు వెళుతున్నారని జగన్ వారిని ప్రశ్నించగా, కడుపు నింపుకోవడానికి తమకు ఇంతకంటే మార్గం లేదని వారు చెప్పడంతో చలించిపోయారు. మీ కుటుంబాలకు అండగా నిలబడుతామని జగన్ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన నేరుగా చింతారెడ్డిపాలెంలోని నారాయణ ఆసుపత్రికి వెళ్లారు. ఐసియులో చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న బాధితులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. త్వరగానే కోలుకుంటారని బాధితులకు ధైర్యం చెప్పారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, మృతుల కుటుంబాలకు పది లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మనసున్న మనిషేకాదని, ఏ మాత్రం మానవత్వమున్నా వెంటనే వచ్చి బాధితులను చూసుండేవాడన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, శాసనసభ్యులు పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి గౌతంరెడ్డి, కిలివేటి సంజీవయ్య, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘువేంద్రరెడ్డి, జిల్లా వైకాపా నాయకులు పాల్గొన్నారు.

నారాయణ ఆసుపత్రికి జగన్ వచ్చిన సందర్భంలో నారాయణలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది పెద్దఎత్తున ఆయనను చూసేందుకు రావడం విశేషం.

నారాయణ ఆసుపత్రి నుండి బయల్దేరిన జగన్ సింహపురి ఆసుపత్రికి వెళ్లి ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న సంగం జడ్పీటీసీ దేవసహాయం దంపతులను కూడా పరామర్శించారు.

# ముహూర్తం కుదరలేదా?

నీళ్లల్లో గడ్డపారను నానబెట్టే వారిలో చంద్రబాబు ముందువరుసలో వుంటారు. ఏ విషయాన్నయినా ఆయనకు తెంచడం కంటే నాన్చడమే ఇష్టం. ఈటీవీ సీరియల్స్ ఎక్కువుగా చూస్తుంటాడేమో... ఏ విషయాన్నయినా ఈటీవీలోని సీరియల్స్ మాదిరిగానే సాగదీస్తుంటాడు. టీవీ ప్రేక్షకులు టెన్షన్‌తో చచ్చినట్లే, మంత్రి పదవులు, నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నాయకులు కూడా చంద్రబాబు ఎప్పుడు ఈ పదవుల సీరియల్‌కు తెరదించుతాడో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

రెండున్నరేళ్ల ప్రభుత్వంలో పదవుల పంపకాలు అదిగో సంక్రాంతి అంటే ఇదిగో ఉగాది అంటూ వాయిదాలు పడుతూ వచ్చాయి. మొన్న దసరాకు కూడా మంత్రి వర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల పందేరం ఉంటుందనుకున్నారు. తీరాచూస్తే ఆ సస్పెన్స్ థ్రిల్లర్‌ను చంద్రబాబు ఇంకా కొనసాగిస్తూనే వున్నాడు.

ఇప్పుడు 2017లోకి కూడా ప్రవేశించాం. ఫిబ్రవరిలో మంత్రివర్గ విస్తరణతో పాటు కొందరికి నామినేటెడ్ పదవులు రావొచ్చు. మంత్రి పదవుల ఆశావహుల జాబితాలో నెల్లూరుజిల్లాకే చెందిన మాగుంట శ్రీనివాసులురెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిలు వున్నారు. ప్రకాశం జిల్లా నుండి మాగుంట, నెల్లూరుజిల్లా నుండి సోమిరెడ్డి రేస్‌లో వున్నారు. ఫిబ్రవరిలో పదవుల పంపకం ఉంటుందని పసుపు తమ్ముళ్లు గట్టిగా విశ్వసిస్తున్నారు. మరి వారి ఊహలు నిజమవుతాయో లేక చంద్రబాబు వాయిదాల పద్ధతిని కొనసాగిస్తాడో చూడాలి!







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com